


THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 18 3.10.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# కూటమిని కుదిపేస్తున్న.. 'స్టార్' వార్



## చిరంజీవిపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు

## శాసనసభ సాక్షిగా 'ఎవడూ' అంటూ నోరుపారేసుకున్న వైనం

## ఆగ్రహిస్తున్న మెగా అభిమానులు

## స్పందించని తమ్ముళ్ళు, తన వాళ్ళు

## లోలోన అన్నయ్య అంతర్మథనం


**కూ**టమి ప్రభుత్వంలో కొత్త లొల్లి మొదలైంది. ప్రధాన పక్షాలైన టీడీపీ, జనసేన మధ్య అభిప్రాయబేధాలు తలెత్తే పరిస్థితి నెలకొంది. టాలీవుడ్ మెగాస్టార్, స్వయంకృషితో అగ్రస్థానానికి ఎదిగిన చిరంజీవిని తూలనాడుతూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు.. మెగా, నందమూరి ఫ్యాన్స్ మధ్య రచ్చకు కారణమవుతున్నాయి. దీంతో ఇన్నాళ్లూ అనంతపురం ఎమ్మెల్యే పుణ్యాన, బాలయ్య వర్సెస్ ఎన్టీఆర్‌గా నడిచిన సోషల్ మీడియా రచ్చ, తాజాగా చిరు వర్సెస్ బాలయ్యగా మారింది.

సౌమ్యుడు, అందరివాడిగా పేరున్న మెగాస్టార్‌ను 'ఎవడూ' అంటూ సంబోధించి బాలకృష్ణ తన స్థాయిని తానే తగ్గించుకున్నారనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మెగా కుటుంబంపై ఉన్న అసూయతోనే బాలయ్య నోరుజారారని, అయితే హుందాగా వ్యవహరించి క్షమాపణ చెప్పి ఉంటే బాగుండేదని, కానీ ఇప్పటివరకు బాలకృష్ణ పట్టించుకోకపోవడం అంటే... అధికార గర్వం తలకెక్కడమే అంటూ చిరంజీవి అభిమానులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ విషయంపై చిరంజీవి కుటుంబసభ్యులైన స్టార్ హీరోలెవ్వరూ కనీసం స్పందించకపోవడం విమర్శలకు కారణమవుతోంది.

### బాలయ్యా... ఇది భావ్యమేనా?

మూడు సార్లు ఎమ్మెల్యే, 50 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే బాలకృష్ణ తనకంటే వయస్సులో పెద్దవారు, పద్మవిభూషణుడు, దశాబ్దాలుగా సినీ రంగాన్ని నంబర్-1గా ఏలుతున్న సహచర నటుడైన చిరంజీవిపై 'ఎవడూ..' అంటూ మాట్లాడడం ఎంతమాత్రం సహేతుకం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక సమస్య విషయానికి వస్తే, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఇటీవల శాసనసభలో గత జగన్ ప్రభుత్వంలో సినీ పెద్దలకు అవమానం జరిగిందంటూ ప్రసంగించారు. ఆ సమయంలో, జగన్ శాడిస్టులా ప్రవర్తించారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ తొలుత సినీ పెద్దల భేటీ విన్నపాన్ని తిరస్కరించారని, అయితే మెగాస్టార్ చిరంజీవి గట్టిగా అడగడంతోనే సమావేశమయ్యారని ఆరోపించారు. ఈ క్రమంలో జగన్ తన క్యాంపు కార్యాలయం గేటు ముందే కార్లను నిలిపేసి

2లో



# 'స్టార్'వార్

(మొదటిపేజీ తరువాయి)

సినీపెద్దలు నడుచుకుంటూ లోనికి వెళ్లేలా చేసి అహంకారంతో ప్రవర్తించి అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై సభలో ఉన్న బాలకృష్ణ స్పందిస్తూ, సైకోగాడు అంటూ జగన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పనిలోపనిగా 'ఎవడూ గట్టిగా అడగలేదు, అంతసీన్ లేదు..' అంటూ చిరంజీవిని తూలనాడారు. దీంతో వివాదం రేగింది. మెగా అభిమానులు అగ్గిమీద గుగ్గిలమయ్యారు. విదేశాల్లో ఉన్న చిరంజీవి కూడా వెంటనే దీనిపై ఓ ప్రకటన ద్వారా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

## మేం కలవడం వల్లే ఎంతో కొంత లబ్ధి..!

బాలకృష్ణ వ్యాఖ్యలపై చిరంజీవి స్పందిస్తూ, గతంలో కొందరు సినీ ప్రముఖులు తనను కలిసి కోవిడ్ పరిస్థితుల కారణంగా సినీరంగం కుదేలైందని, నిర్మాణ వ్యయం పెరిగిందని, దాన్ని మళ్లీ గాడిలో పెట్టాలంటే టికెట్ రేట్లు పెంచాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో చొరవ తీసుకోవాలని తనను కోరినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు. దీంతా తాను అప్పట్లో సినిమాటోగ్రఫీ మంత్రైన పేర్ని నానిని సంప్రదించి ముఖ్యమంత్రితో సినీ ప్రముఖుల సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జగన్‌ను కలిసే సమయంలో జెమినీ కిరణ్ ద్వారా బాలకృష్ణను ఆహ్వానించేందుకు యత్నించామని, కానీ మూడుసార్లు ప్రయత్నించినా బాలకృష్ణ అందుబాటులోకి రాలేదని వివరణ ఇచ్చారు. ఇక జగన్ సినీ ప్రముఖులను సాదరంగా ఆహ్వానించి ఇండస్ట్రీ సమస్యలను విన్నారని స్పష్టం చేశారు. అలా తాము జగన్‌ను కలవడం వల్లే తన వాల్తేరు వీరయ్య సినిమాకైనా, బాలకృష్ణ వీరసింహారెడ్డి సినిమాకైనా టికెట్ రేట్లు పెరిగి బయ్యర్లు, నిర్మాతలు లబ్ధి పొందారని తేల్చిచెప్పారు. అయితే ఈ విషయంపై బాలకృష్ణ వ్యంగ్యంగా మాట్లాడడం, తన పేరు ప్రస్తావన రావడంతోనే వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అందరివాడిని.. ఒంటరిని చేశారా?

ఇండస్ట్రీలో ఎందరికో సహాయ సహకారాలు అందించి, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపి, రక్తదానం, నేత్రదానం వంటి కార్యక్రమాలతో లక్షలాది మందికి సాయం చేసి, కోవిడ్ సమయంలో మెడికల్ కిట్లు అందించి తన గొప్ప మనస్సును చాటుకున్న వ్యక్తి చిరంజీవి. అలాంటి వ్యక్తిని 'ఎవడూ' అని బాలకృష్ణ అవమానించడంపై మెగా అభిమానులు కుతకుతలాడుతున్నారు. బాలకృష్ణ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో బాలకృష్ణపై పోలీసు కేసుల నమోదుకు నిర్ణయించారు. అయితే, విదేశాల నుంచి వచ్చిన చిరంజీవి ఈ విషయాన్ని పెద్దది చేయకండి అంటూ వారిని సున్నితంగా వారించినట్లు తెలుస్తోంది. కానీ, కేవలం అభిమానులు మాత్రమే చిరంజీవి కోసం మాట్లాడడం మిగిలిన కుటుంబసభ్యులెవ్వరూ స్పందించకపోవడం సినీ, రాజకీయ వర్గాలలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

## మూగబోయిన మెగా కుటుంబం!

సినీ ఇండస్ట్రీలో 8 మంది హీరోలు, నిర్మాతలు ఉన్న ఫ్యామిలీగా మెగా కుటుంబానికి పేరుంది. గతంలో దాసరి నారాయణరావులా, చిరంజీవి కూడా ఎన్నో సమస్యల్లో ఇండస్ట్రీకి పెద్ద దిక్కుగా వ్యవహరించారు. ఇలాంటి చిరంజీవికి నిండు శాసనసభలో అవమానం జరిగినా పవర్‌స్టార్‌లు, మెగా పవర్‌స్టార్‌లు, మెగా తమ్ముళ్లు, అల్లూ కుటుంబసభ్యులు ఎవ్వరూ స్పందించకపోవడంతో సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. చిరంజీవి నీడలో ఎదిగిన తమ్ముడు పవన్‌కళ్యాణ్ కూడా ప్రస్తుతం తన రాజకీయ అవసరాల కోసం సైలెంట్ అయ్యారని మెగా అభిమానులు సోషల్ మీడియాలో దుమ్మెత్తిపోస్తున్నారు. అన్నింటికీ తగుదునమ్మా అంటూ ముందుగా స్పందించే నాగబాబుకు నోటికి ఎమ్మెల్సీ పదవి అడ్డుగామారి మాట రాకుండా చేస్తోందా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇక బావకు అవమానం జరిగితే అల్లు కుటుంబం స్పందించదా..? అని నిలదీస్తున్నారు. చిరంజీవి సైతం తమ్ముళ్ల మౌనంపై లోలోన అంతర్మథనం చెందుతున్నారనే ప్రచారం సాగుతోంది. కానీ ఏ విషయాన్ని బహిరంగంగా, విమర్శనాత్మకంగా ప్రస్తావించే అలవాటు లేని చిరంజీవి ఈ అంశంలోనూ లోలోపలే సంఘర్షణకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో తటస్తులు సైతం చిరంజీవిపై సానుభూతి వ్యక్తం చేస్తూ పోస్టులు పెడుతుండడం గమనార్హం. ఇక ఆ సమయంలో జగన్‌ను కలిసేందుకు చిరంజీవితో పాటు వెళ్లిన ప్రభాస్, మహేష్‌బాబు, రాజమౌళి వంటి ముఖ్యులు సైతం అన్నీ తెలిసినా ఈ విషయంలో స్పందించకపోవడం గమనార్హం.

## సమస్యకు ముగింపేదీ..?

తన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నా బాలకృష్ణ నోరు జారానంటూ స్పందించకపోవడం, ఆ సమయంలో సభలో ఉన్న జనసేన ఎమ్మెల్యేలు సైతం బాలకృష్ణ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరకపోవడం, సభాపతి స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సైతం బాలకృష్ణను నిలువరించకపోవడం, కనీసం చంద్రబాబు కూడా శాసనసభలో వివరణ ఇవ్వకపోవడం వివాదాస్పదమవుతోంది. ఇక ఇంత జరుగుతున్నా, జ్వరం పేరుతో ఇంట్లో దాక్కున్నాడంటూ పవన్‌కల్యాణ్‌పై మెగాఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. గత ఎన్నికల్లో జనసేన గెలుపు కోసం తన కుటుంబసభ్యులను ప్రచారానికి పంపించి, ఆశీస్సులు, సపోర్టు అందించి, ఆర్థిక సాయం ప్రకటించి, కాపు సామాజిక వర్గం మొత్తం ఒక్కటవడానికి కారణమైన చిరంజీవి విషయంలో పవన్ కల్యాణ్ మిన్నకుండిపోవడం ఎంతమాత్రం సహేతుకం కాదంటూ విశ్లేషకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. ఇది జనసేనకు మైలేజ్ ఇవ్వకపోగా, డ్యామేజ్ కలిగించడం మాత్రం తథ్యమని స్పష్టం చేస్తున్నారు. ఇక నష్ట నివారణ కోసం ఎలా స్పందించాలో తెలియక తికమకపడుతున్న తెలుగుదేశం నాయకులు, బాలకృష్ణ అభిమానులు మాత్రం బాలయ్య మనస్సులో తప్పుడు ఉద్దేశాలేమీ లేవని, జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసే సమయంలో టంగ్‌స్లిప్ అయ్యారంటూ కవర్ చేస్తున్నారు. ఏదేమైనా టాలీవుడ్ స్టార్‌వార్, కూటమికి కొత్త తలనొప్పులు తీసుకొచ్చిందనడంలో ఏమాత్రం సందేహం అవసరంలేదు. ఈ వివాదం చినికిచినికి గాలివానగా మారుతుందా.. లేక టీకప్పులో తుఫానులా వీగిపోతుందా అన్నది వేచి చూడాలి..!

## టీటీడీ బెంగళూరు స్థానిక సలహామండలి సభ్యుడు
# కనకమేడలకి.. రావి అభినందనలు



తిరుమల తిరుపతి దేవస్థానాల స్థానిక సలహామండలి అధ్యక్షుడిగా బెంగళూరు నగరం, మల్లేశ్వరంలోని టీటీడీ ఆలయంలో కనకమేడల వీరాంజనేయులు, సెప్టెంబర్ 26వ తేదీ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆయనని అభినందిస్తున్న కర్ణాటక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రావి మోహన్‌చౌదరి.

## రామలింగాపురం అండర్‌బ్రిడ్జి..
# 3న పునః ప్రారంభం



నెల్లూరు నగరంలోని రామలింగాపురం అండర్‌బ్రిడ్జి వద్ద జరుగుతున్న నిర్మాణపు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అక్టోబరు 3న పునఃప్రారంభమవుతుందని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు ఆయన అధికారులతో కలసి ఆ పనులను పరిశీలించారు. రూ.1.17 కోట్లతో అండర్‌బ్రిడ్జి రోడ్డు, బాక్స్ కల్వర్టు, ఇతర ఆధునీకరణ పనులు చేపట్టామని, ఆ పనులన్నీ పూర్తికావచ్చాయని చెప్పారు.

# గ్రామదేవతకు..ప్రసన్న పూజలు



కోవూరు నియోజకవర్గ వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సెప్టెంబరు 28 ఆదివారం నాడు కోవూరు గ్రామదేవత నాగవరపమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోవూరు నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో సంతోషంగా, సుభిక్షంగా ఉండాలని ఆయన అమ్మవారిని ప్రార్థించారు. ఈ పూజల్లో వైసీపీ యువనాయకుడు నల్లపరెడ్డి రజిత్ కుమార్‌రెడ్డి, శివుని నరసింహులురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, అత్తిపల్లి అనూష్‌రెడ్డి, జడ్పీటీసీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# జక్కా కామేశ్వరమ్మకి ప్రసన్న నివాళి



సెప్టెంబర్ 30వ తేదీ మంగళవారం నాడు పరమపదించిన మాజీ శాసనసభ్యుడు జే.కే.రెడ్డి తల్లి శ్రీమతి జక్కా కామేశ్వరమ్మ భౌతిక కాయాన్ని ప్రసన్నకుమార్‌రెడ్డి అక్టోబర్ 1వ తేదీ బుధవారం ఉదయం జగదేవిపేటలోని ఆమె స్వగృహంలో సందర్శించి నివాళులర్పించారు. కామేశ్వరమ్మ కుమారుడు శివనారాయణ రెడ్డిని, కుమార్తెలను, ఇతర కుటుంబసభ్యులను ఆయన ఓదార్చారు.

## మాజీ శాసనసభ్యులు జే.కే.రెడ్డి మాతృమూర్తి
# జక్కా కామేశ్వరమ్మ కన్నుమూత



నెల్లూరు నగర మాజీ శాసనసభ్యులు, రెడ్డిజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జక్కా కోదండ రామిరెడ్డి (జే.కే.రెడ్డి) మాతృమూర్తి శ్రీమతి జక్కా కామేశ్వరమ్మ సెప్టెంబర్ 30వ తేదీ మంగళవారం సాయంత్రం తమ స్వగ్రామం జగదేవిపేటలోని ఆమె ఇంట్లో తుదిశ్వాస విడిచారు. కామేశ్వరమ్మ వయస్సు 105 సంవత్సరాలు. గత 6నెలలుగా ఆమె అస్వస్థతతో ఉన్నారు. కామేశ్వరమ్మ భర్త స్వర్గీయ జక్కా రంగారెడ్డి రైతుజన బాంధవుడిగా, రైతు నాయకుడిగా జిల్లా వాసులకి చిరపరిచితులు. మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డికి కామేశ్వరమ్మ స్వయానా పెద్దమ్మ.

రంగారెడ్డి కామేశ్వరమ్మ దంపతులకి 9 మంది సంతానం. నలుగురు కుమారులు, అయిదు మంది కుమార్తెలు. ఆమె పెద్ద కుమారుడు జక్కా రాధాకృష్ణారెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదవీ విరమణ పొందారు. అనంతరం కొద్ది కాలానికి రోడ్డు ప్రమాదంలో అసువులు బాశారు. ఆమె రెండవ కుమారుడు జే.కే.రెడ్డి విలువలున్న రాజకీయ నాయకుడిగా, నెల్లూరునగర శాసనసభ్యుడిగా, మంచి మనసున్న మానవతావాదిగా ఖ్యాతిగాంచారు. నెల్లూరు నగరంలో ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతూ, అత్యంత ఖరీదైన ప్రాంతంగా భాసిల్లుతున్న మినీ బైపాస్ (రాజీవ్ రహదారి) రోడ్డు 1989-1994 మధ్యకాలంలో జే.కే.రెడ్డి శాసనసభ్యుడిగా వున్న తరుణంలో రూపకల్పన చేయబడిందే. నగరంలో భవిష్యత్తులో పెరగనున్న ట్రాఫిక్‌ని దృష్టిలో పెట్టుకుని 30 సంవత్సరాల క్రితమే జే.కే రెడ్డి బైపాస్ రోడ్డుని ప్రతిపాదించి ప్రారంభింపచేశారు. అలాగే చిన్న బజారులో ఇరుకు సందుల్లో వున్న ఏ.సి. సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్టుని మద్రాస్ బస్టాండు ప్రాంతానికి మార్చడానికి చొరవచూపింది కూడా జే.కే.రెడ్డే కావడం గమనార్హం.

ఆమె మూడవ కుమారుడు జక్కా శ్రీనివాసులరెడ్డి (జే.ఎస్.రెడ్డి) నగరంలోని చిన్న పిల్లల పార్కుకి స్ఫూర్తిదాతగా, నెల్లూరు టౌన్‌హాల్ పునర్నిర్మాణ దాతగా, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలోని జక్కా సుజాతమ్మ క్యాన్సర్ నిర్ధారణ కేంద్ర వ్యవస్థాపకునిగా ప్రసిద్ధి చెందారు. తమ తండ్రి పేరుతో 'జక్కా రంగారెడ్డి స్మారక కళాపీఠం' స్థాపించి కళా రంగానికి సేవలందించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుని ప్రోత్సహించి రైతు బిడ్డ అనిపించుకున్నారు. ఎంతోమంది పేద విద్యార్థినీవిద్యార్థుల చదువుకోసం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆమె నాలుగవ కుమారుడు జక్కా శివనారాయణరెడ్డి కాంట్రాక్టర్‌గా హైదరాబాదులో స్థిరపడ్డారు.

జక్కా కామేశ్వరమ్మ భర్త రంగారెడ్డి,పెద్ద కోడలు జక్కా సుజాతమ్మ, మూడవ కోడలు జక్కా సౌదామిని, మూడవ కుమారుడు జే.ఎస్.రెడ్డి, అయిదవ కుమార్తె నిర్మలతో సహా మొత్తం ఈ అయిదు మందినీ క్యాన్సర్ మహమ్మారి పొట్టన పెట్టుకుని ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. ఆమె రెండవ కోడలు జక్కా సులోచనమ్మ కూడా గత ఏడాది అనారోగ్యంతో తనువు చాలించారు. ఆమె పెద్ద మనుమడు జక్కా రామ్మోహన్ (జే.కేరెడ్డి పెద్ద కొడుకు) సైతం కొన్నేళ్ళ క్రితం అనారోగ్యంతో కన్ను మూశాడు.

తన 105 సంవత్సరాల నిండు జీవితంలో జక్కా కామేశ్వరమ్మ ఎన్నో ఆటుపోట్లని తట్టుకున్నారు. తన కళ్ళముందే ఒక్కొక్కరుగా కుప్పకూలుతున్న కుటుంబసభ్యులని చూసి చలించిపోయారు. తన చివరిశ్వాస వరకూ ఆమె తన సొంత ఇంటినీ, తాను కోడలిగా అడుగుపెట్టిన జగదేవిపేట గ్రామాన్ని విడిచి రాలేదు. అక్టోబర్ 1వతేదీ జగదేవిపేటలోనే ఆమె అంతిమ సంస్కారాలు జరిగాయి. ఇంటి పెద్దదిక్కుని కోల్పోయి శోకసంద్రంలో వున్న జక్కా కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# ఉత్తరక్రియలు



అమృతమూర్తి, ఆత్మీయదీప్తి

## శ్రీమతి కేసవరపు గిరిజమ్మ

సెప్టెంబర్ 25వ తేదీ తెల్లవారుఝామున స్వర్గస్తురాలైనారు.

**ఆమె పవిత్ర ఆత్మకి సద్గతి చేకూరాలని ప్రార్థిస్తూ..**

భర్త : **కేసవరపు ఆదినారాయణరెడ్డి**

కుమార్తె - అల్లుడు

**బుర్లా లక్ష్మి**
**బుర్లా శరత్‌కుమార్**

కుమారుడు - కోడలు

**డాక్టర్ కేసవరపు సుబ్బారెడ్డి**
**డాక్టర్ పద్మిని శిల్ప**

మనుమడు, మనుమరాళ్ళు:

**డాక్టర్ నేహా, అమిత్, తన్వి**

### ఉత్తరక్రియలు:

వారి **'పెద్దకర్మ' 09.10.2025 గురువారం** ఉదయం 11.00 గంటలకి, ప్రకాశం జిల్లా, ఈతముక్కల గ్రామంలోని వారి స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకి తెలియజేయడమైనది.

చిరునామా కోసం

క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి

లాయర్
అక్టోబర్ 03, 2025

# టీమిండియా.. అదరగొట్టేనయా!

టీమిండియా అదరగొట్టేసింది. ప్రతిష్టాత్మకమైన ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు మరోసారి చాంపియన్‌గా నిలిచి విజయకేతనం ఎగురవేసింది. పాక్ జట్టును ఒకసారి కాదు, ఈ టోర్నీలో ఏకంగా మూడుసార్లు చిత్తు చేసింది. దుబాయ్‌లో జరిగిన ఈ పోటీల్లో, టీమిండియా తన చిరకాల ప్రత్యర్థి అయిన పాక్ జట్టును ఓడించి ఆసియా కప్-2025ని అందుకోవడంతో భారత్‌లో సంతోషం వెల్లువెత్తింది. ఫైనల్స్ పోరులో 5 వికెట్ల తేడాతో పాకిస్థాన్ జట్టును టీమిండియా మట్టికరిపించింది. ఒకవిధంగా చెప్పాలంటే, ఈ దసరా పర్వదినాల రోజుల్లో దేశానికిదో సంతోషదాయకమైన వార్త. 'అపరేషన్ సిందూర్'లోనే కాదు, క్రికెట్టాటలో సైతం విజయం మనదేనని టీమిండియా జట్టు క్రీడాకారులు మరోసారి రుజువు చేశారు. అయితే, భారతీయులకు గతంలో వలే, ఈ మ్యాచ్ పట్ల పెద్దగా ఉత్కంఠ ఏమీ లేదు. ఒకప్పుడు భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్ అంటేనే ఒక్క భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనంగా ఉండేది. టీవీల ముందు నుంచి జనం కదిలేవారు కాదు. అందులోనూ ఫైనల్స్ అంటే ఎంత ఆసక్తో చెప్పనే అక్కరలేదు. అయితే, ఇప్పుడా ఆసక్తి భారతీయుల్లో బాగా తగ్గిపోయింది. పహల్గాం దుర్ఘటన నేపథ్యంలో, పాక్‌పై దేశప్రజలంతా అగ్రహోదగ్రులైన విషయం తెలిసిందే. అయినా, అమాయకుల ప్రాణాలను అకారణంగా, అత్యంత పాశవికంగా బలిగొన్న ఆ ఘటనను ఎలా మరచిపోగలం?.. అందుకే, అలాంటి ముష్కరులతో ఇక ఏ ఆటలూ ఆడాల్సిన అవసరం లేదని భారత ప్రజలు మండిపడుతున్నారు కూడా. ఈ నేపథ్యంలో, అనేక రకాల వత్తిడులను అధిగమిస్తూనే, భారత ఆటగాళ్ళు ఆట మొదలెట్టినా, ఆ పోరుపై ప్రజలు అంతగా ఆసక్తి చూపలేదు. మనవాళ్ళు ఎటూ గెలస్తారు.. గెలిచి తీరుతారనే నమ్మకం మాత్రం అందరిలో ఉంది. అందుకు తగ్గట్టుగానే మనవాళ్ళు ఆ నమ్మకం నిలబెట్టుకున్నారు. అత్యద్భుతమైన ఆటతీరుతో పాక్‌ని హడలగొట్టేశారు. భారత క్రీడాకారులు, బౌలర్లు మైదానంలో మెరుపులు మెరిపించారు. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే చతికిలబడిపోగా, భారత బౌలర్లు మాత్రం వేగంగా స్పందించారు. కులదీప్‌యాదవ్ 4 వికెట్లుతో విజృంభిస్తే, జస్ప్రిత్ బుమ్రా, వరుణ్ చక్రవరి, అక్షర్‌పటేల్ రెండేసి వికెట్లు తీసి ఔరా అనిపించారు. 33 పరుగుల వ్యవధిలో చివరి 9 వికెట్లు పడగొట్టి పాక్‌ని చాలా తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. అసామాన్య క్రీడాప్రతిభతో ఆసియా కప్‌ని మనవాళ్ళు చేజిక్కించుకున్నారు. ఐపీఎల్‌లో ముంబై తరపున టీ-20 జట్టులో చేరి అద్వితీయమైన ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్న తెలుగుబిడ్డ.. హైదరాబాద్ క్రీడాకారుడు నంబూరి ఠాకూర్ తిలక్‌వర్మ, క్లిష్టపరిస్థితుల్లో గొప్పగా ఆడి ఈ పోరులో హీరో అనిపించుకున్నాడు. మైదానంలో పరుగుల మోత మోగించాడు. బ్యాటింగ్‌లో చిచ్చరపిడుగనిపించాడు. ఎంతో ఓర్పు-నేర్పుతో ఆడి తాను అజేయంగా నిలవడమే కాక, భారత్‌జట్టును విజయతీరానికి చేర్చాడు. దీంతో భారత్ 9వసారి ఆసియా కప్‌ను చేజిక్కించుకున్నట్లయింది. 1984లో మొట్టమొదటిసారి ఆసియాకప్ పోటీల్లో భారత్ ఘనవిజయం సాధించింది. ఆ తర్వాత 1988, 19990, 1995, 2010, 2016, 2018, 2023 సంవత్సరాల్లోనూ ఆసియాకప్ భారత్‌దే. ఇలా ఎనిమిదిసార్లు ఆ కప్ సాధించిన భారత్, తొమ్మిదోసారి కూడా పట్టిన పట్టు వీడకుండా ఆడి కప్‌ని సొంతం చేసుకోవడం భారతీయులందరికీ గర్వకారణం. 'మైదానంలో ఆపరేషన్ సిందూర్'లా భారత్ విజయాన్ని అభినందిస్తున్నానంటూ ప్రధాని మోడీ సంతోషం వెలిబుచ్చారు. ప్రత్యర్థికి విజయంతోనే బుద్ధిచెప్పి భారత్ జట్టు తన ప్రత్యేకతను నిలుపుకుంది. యుద్ధభూమిలోనే కాదు, క్రీడామైదానంలోనూ విజయం తమదేనని భారత్ జట్టు ఈ అద్భుత విజయంతో చెప్పకనే చెప్పినట్లయింది. చివరికి పాక్ మంత్రి చేతులమీదుగా ట్రోఫీని అందుకోవడానికి కూడా నిరాకరించి భారత్ క్రీడాకారులు తమ ఆత్మగౌరవాన్ని చాటుకున్నారు. పాక్ జట్టు కొందరు క్రీడాకారులు ఆట మధ్యలో తమ లేకిబుద్ధిని ప్రదర్శించి రెచ్చగొట్టడానికి ప్రయత్నించినా భారత్ క్రీడాకారులు తమ సంయమనం కోల్పోలేదు. ఇంతటి అద్భుత విజయం సాధించిన తర్వాత కూడా ప్రత్యర్థి ఆటగాళ్ళతో చేయికలిపి కరచాలనం చేసేందుకు కూడా మన క్రీడాకారులు అంగీకరించకపోవడం భారత్ ధీశక్తికి నిదర్శనం. ఏదేమైనా, చిరకాల ప్రత్యర్థి అయిన పాక్‌కి మరోసారి చుక్కలు చూపించిన టీమిండియాకి అభినందనలు.

జయహో!.. భారత్!...

## కొత్త జి.ఎస్.టీతో మహిళల్లో ఆనందం!




కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించి అమలు చేస్తున్న కొత్త జి.ఎస్.టీ విధానం మంచి ఫలితాలని ఇస్తోంది. ముఖ్యంగా ఈ కొత్త పథకంతో మహిళలు సంబరం చేసుకుంటున్నారు. వంటింట్లో ఉపయోగించే నిత్యావసరాల వస్తువులన్నింటిపైనా తగ్గింపు స్పష్టంగా కనిపిస్తోందని మహిళామణులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగ కానుకగా ప్రకటించిన ఈ కొత్త జి.ఎస్.టి విధానం దీపావళి వెలుగులని ముందే తెచ్చిందన్న సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నాడి తెలుసుకోవడంలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిట్ట. ముఖ్యంగా మహిళలని ఆకట్టుకోవడానికి ఏం చేయాలో ఆయనకి బాగా తెలుసు. కొత్త జి.ఏస్.టి విధానాన్ని ఆయన ప్రభుత్వం ఈ సెప్టెంబర్22 నుండి అమలులోకి తెచ్చింది. అందుకు ఒక్కరోజు ముందు అంటే 21వతేదీన ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ కొత్త పన్నుల విధానం వల్ల ప్రజలకి కలిగే లాభాలని ఆయనే స్వయంగా వివరించారు. దిగువ, మధ్య తరగతి కుటుంబాల ప్రజలని ఆకట్టుకునేలా మోడీ ప్రభుత్వం కొత్త పన్నుల విధానాన్ని రూపొందించింది. ఆయా కుటుంబాలలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. జయహో మోడీ!

యం. చంద్రమౌళి - కొత్తఢిల్లీ.

## అమ్మవారి ఆలయాలలో ఏర్పాట్లు బాగున్నాయి!

ఈసారి విజయదశమి వేడుకలలో కొత్తదనం కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాలలో దసరా సంబరాలని, దేవీ నవరాత్రులని అంగరంగ వైభవంగా జరపడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గారు అన్ని ఆలయాలని సందర్శించి ఏర్పాట్లని పర్యవేక్షించడం అభినందనీయం. భక్తులకి ఎక్కడా అసౌకర్యం కలగకుండా అధికారులని అప్రమత్తం చేసి, పండుగ వేడుకలని విజయవంతం చేయడంలో ప్రత్యేక చొరవ చూపించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి గారికి నా అభినందనలు.

– డి.హరిత, గూడూరు.

## పాదయాత్ర చేస్తే ఫలితం ఉంటుందా?

"మూడేళ్ళు మౌనముద్ర... ఆ తరువాత పాదయాత్ర" అంటూ గత వారం మన 'లాయర్'లో వచ్చిన ప్రధానవార్త చదివాక నాకు అనేక అనుమానాలు వస్తున్నాయి. గత ఎన్నికలలో వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఘోరంగా ఓడిపోవడానికి కారణం జనాదరణ లేక కాదన్న విషయాన్ని ఆయన గుర్తించారా లేదా..?ఆయనకి జనం 40 శాతం ఓట్లు వేశారన్న సంగతి ఆయన గ్రహించారా.. లేదా..? తన చుట్టూచేరిన భజన బృందమే ఆయనని ఓడించారన్న వాస్తవం ఆయనకి అర్థమయ్యిందా లేదా..? సజ్జల, చెవిరెడ్డి, పెద్దిరెడ్డి, ధనుంజయరెడ్డి వంటి దుష్టగ్రహాల వల్లనే ఆయన తీవ్రంగా నష్టపోయారని తన పార్టీ నాయకులే బహిరంగంగా విమర్శించడం జగన్ చెవికి చేరిందా లేదా..? ఆయన తలకెక్కిందా లేదా..? ఇంకా ఆ నలుగురినే పక్కన పెట్టుకుని, పాదయాత్రలతో పార్టీ నడిపిస్తానంటే ప్రయోజనం ఉంటుందా..? అన్నవి నా అనుమానాలు.

బి.నారాయణరెడ్డి, బెంగళూరు.




## మరణమృదంగాలు మోగిస్తున్న గ్రావెల్ మాఫియా!

మన రాష్ట్రంలో గ్రావెల్ మాఫియా నిర్లక్ష్యం ఫలితంగా ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కాసుల కక్కుర్తి కోసం అక్రమార్కులు తమ ఇష్టానుసారం మట్టిని తవ్వుకుపోతున్న కారణంగా భారీ గుంటలు ఏర్పడుతున్నాయి. అవి చిన్నారుల పాలిట కాలయముళ్ళగా మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సహజ వనరుల దోపిడీలో భాగంగా, మట్టిమాఫియాలు చెలరేగిపోయి చెరువులు, దొరువులు, పొలాలు, కాలువలు, ఇలా 'అక్రమ సంపాదనకి కాదేది అనర్హం' అన్నట్లుగా ఎక్కడ పడితే అక్కడ మట్టిని లోడుకుని అమ్మేశారు. రాత్రీపగలూ అన్న తేడా లేకుండా తమ అరాచకాలని సాగించి అక్రమంగా కోట్ల రూపాయలను మూటగట్టుకున్నారు. కానీ, వాళ్ళు తీసిన ఆ గుంటలు ఇప్పటికీ చిన్నారుల ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి. తాజాగా ఇటీవలే నెల్లూరుజిల్లా కలువాయి మండలం ఉయ్యాలపల్లి గ్రామంలో అయిదో తరగతి చదువుకుంటున్న ఇద్దరు బాలలు ఈ గ్రావెల్ గుంటల్లోపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. పిల్లలను కోల్పోయిన ఆ తల్లితండ్రులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదు. గ్రావెల్ గోతులంటే మనుషుల ప్రాణాలని హరించే మృత్యు కూపాలని జనం తెలుసుకునే సరికే అనేక ప్రాణాలు ఆ మట్టిగుంటల్లో కలిసిపోతున్నాయి.

### ప్రకృతి వనరుల్ని అప్పుడు, ఇప్పుడు అడ్డంగా దోచేసుకుంటున్నారు!

ప్రకృతి వరంలా మనకి ప్రసాదించిన గ్రావెల్, ఇసుక, సిలికా, క్వార్జ్ ద్వారా వేల కోట్లు వెనకేసుకునే సంప్రదాయం గత ప్రభుత్వం నుండే ప్రారంభమయ్యింది. మైనింగ్‌లో అపార అనుభవమున్న కుటుంబానికి చెందిన వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడమే అందుకు ప్రధాన కారణం. 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్న తరహాలో ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని నాయకులు, అక్రమార్కులు కూడా గత ప్రభుత్వం చూపించిన దారిలోనే నడుస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యంత దయనీయంగా ప్రకృతి వనరులు భారీస్థాయిలో ధ్వంసంచేస్తున్నారు. చెట్టు, పుట్ట, గుట్ట, అడవులు, కొండలు, ఖనిజాలు, చివరికి మట్టి, ఇసుక అన్నీ అక్రమార్కుల చేతిలోకి వెళ్ళిపోయాయి. ప్రజలకు లేదా ప్రభుత్వానికి చెందిన ప్రకృతి వనరులన్నిటినీ కొల్లగొట్టుకుపోతున్నారు. అనేక ప్రాంతాల్లో బోసిపోయిన కొండలు, లోయల్లా కనిపించే గ్రావెల్ గుంటలు దోపిడీదారుల దుర్మార్గాలకు ఆనవాళ్ళుగా దర్శనమిస్తున్నాయి. అధికారులు, నాయకులు మూకుమ్మడిగా దోపిడీ ముఠాగా ఏర్పడి ప్రకృతి వనరులను తమ సొంత ఆస్తులన్నట్లుగా అడ్డంగా దోచేసుకుంటున్నారు. అడ్డుకున్నవారిపై అడ్డగోలు కేసులు పెట్టి వేధిస్తున్నారు. పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు లంచాలు మరిగిన అధికారులు, అక్రమ సంపాదనకి అలవాటు పడ్డ రాజకీయ నాయకులూ రాజ్యమేలితే ఎంత దుర్మార్గంగా ఉంటుందో సాక్షాత్తు మన రాష్ట్రంలో అదే జరుగుతోంది.

### తిలా పాపం తలా పిడికెడు!

మనకి వరంలా లభించిన ప్రకృతి వనరులని తవ్వి తరలించి అమ్ముకోవడానికి అక్రమార్కులంతా కలసి దందాలు సాగిస్తున్నారు. వారు తీసి వదిలేసిన గుంటల్లో అభం శుభం తెలియని చిన్నారులు, లేదా ఈత సరదాతో ఆ గుంటల్లో దిగిన వాళ్ళు చాలామంది ప్రాణాలతో బయటకు రావడంలేదు. అవి మృత్యుకుహరాలని తెలియక, వాటిలో పడి గిలగిలకొట్టుకుంటూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఆ పాపంలో చాలామందికే భాగం ఉంది. ఎక్కడికక్కడ రాజకీయ నాయకులు, అధికారులు, వారి సిబ్బంది సైతం అక్రమసంపాదనకు ఆశపడి, కమిషన్ల కోసం కక్కుర్తిపడి అక్రమార్కులకు అన్ని రకాల అనుమతులిచ్చేశారు. 'తిలా పాపం తలా పిడికెడు' అన్న సామెతగా ఎవరికి అందిన మేరకు వాళ్ళు కోట్లాది రూపాయలు బొక్కేస్తున్నారు.

ప్రకృతి వనరుల సంరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో అనేక విభాగాలు పనిచేస్తున్నాయి. ఆయా విభాగాల అధికారులు మొత్తం అమ్ముడుపోయారు. ప్రభుత్వ పెద్దల చేతుల్లో చిక్కుకుని వారి చేతలకి బానిసలైపోయారు. వాళ్ళు విసిరే ఎంగిలి మెతుకులకి ఆశపడి వారికి దాసోహం అంటున్నారు. కోట్లకొద్దీ ఆస్తులు కూడగట్టుకుంటున్నారు. ఈ మూకుమ్మడి దోపిడీవల్ల ప్రభుత్వానికి ఎన్ని కోట్ల నష్టం వాటిల్లిందో అంతే లేదు. ఇదే తరుణంలో వారి నిర్లక్ష్యానికి ఎంతమంది ఆ గ్రావెల్ గుంటల్లో పడి ప్రాణాలు పోగొట్టుకున్నారో లెక్కేలేదు. ఆ బిడ్డల తల్లితండ్రుల, కుటుంబాల హృదయఘోష వర్ణనాతీతం.

### అక్రమార్కుల భరతం పట్టాలి!

మట్టి, ఇసుకతో పాటు ఇతర సహజ సంపదని తరలించుకుపోవడానికి వేలాది ట్రాక్టర్లు, భారీ టిప్పర్లు ఉపయోగిస్తున్నారు. అవన్నీ రేయింబవళ్ళు తిరగడంతో ఆయా ప్రాంత రోడ్లన్నీ ధ్వంసమై గుంతలమయమైపోతున్నాయి. ఆ వాహనాల క్రింద నలిగి అనేక ప్రాణాలు సైతం చితికిపోతున్నాయి. ఇటీవల పెరమన వద్ద ఏడు నిండు ప్రాణాలు ఇసుక టిప్పర్ క్రింద చితికిపోవడమే అందుకు ఉదాహరణ. చెరువులు దొరువుల వద్ద గమనిస్తే, తాటిచెట్టంత లోతున్న గ్రావెల్ గుంటలు మనకి కనిపిస్తాయి. అక్రమార్కులకి వారికి అన్నివిధాల సహకరిస్తున్న అధికారుల కళ్ళకి అవి కనిపించడం లేదు. వాటిలో పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారి ఆర్తనాదాలు వారికి వినిపించడం లేదు. అంటే, ఏ స్థాయిలో వారు బరితెగించిపోయారో అర్థమవుతుంది. కూటమి ప్రభుత్వం ఈ దారుణాలపై దృష్టిపెట్టాలి. ముందుగా, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ గ్రావెల్ గుంటలున్నాయో వెంటనే సర్వేచేయించి, ఆ గుంటల్లో దిగితే ప్రమాదకరమని హెచ్చరిక బోర్డులు పెట్టించాలి. తవ్వి వదిలేసిన గుంతలవల్ల కలిగే ప్రమాద తీవ్రత పట్ల ప్రజలలో చైతన్యం కల్పించి వారిని అప్రమత్తం చేయాలి. ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తన భుజస్కంధాలపైకి ఎత్తుకోవాలి. ప్రకృతి వనరుల దోపిడీలో కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ బాటలోనే నడుస్తోందన్న అపవాదుని తొలగించుకోవాలి!

- రాజశ్రీ

## వైకాపా హయాంలో.. ఇళ్ల నిర్మాణాలలో..
# 3వేల కోట్ల అవినీతి

వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఇళ్ళ నిర్మాణాల్లో భారీ కుంభకోణం జరిగిందని, సుమారు 3వేల కోట్ల రూపాయల మేరకు అవినీతి జరిగి ఉండవచ్చని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో చెప్పారు. అత్యంత నాసిరకంగా కట్టిన ఆ ఇళ్లల్లో నివాసం పేదలకు దినదిన గండమేనన్నారు. ప్రభుత్వం వెంటనే 'సిట్'తో విచారణ జరిపించి, దోపిడీదారుల నుంచి ప్రతి రూపాయిని వసూలు చేయాలన్నారు. కాంట్రాక్టర్ల నుంచి ఆ సొమ్మును రికవరీ చేయించాలన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూనే అప్పటి నాయకులు జగనన్నకాలనీల పేరుతో



- ఎమ్మెల్యే సోమిరెడ్డి విమర్శ

దుర్మార్గాలకు పాల్పడ్డారని ఆయన వైకాపా నేతలపై ధ్వజమెత్తారు. భూసేకరణ, లే-అవుట్ల అభివృద్ధితో పాటు ఇళ్ల నిర్మాణంలోనూ అవకతవకలు జరిగాయని, ఎలాంటి పునాదులు లేకుండా నేలపైనే నామమాత్రంగా బేస్మెంట్లు కట్టారన్నారు. ఆ అన్యాయాలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించి అక్రమాలను నిగ్గు తేల్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తాను గతంలోనే ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చానని, వెంటనే విచారణ చేపట్టారని, ఒక్క నెల్లూరుజిల్లాలోనే సుమారు నూరు కోట్ల రూపాయల వరకు అవినీతి జరిగినట్లు తేలిందని ఆయన తెలిపారు. అదేవిధంగా, నెల్లూరుజిల్లాలో క్వార్ట్జ్ మైనింగ్‌లో అక్రమార్కులు అందినకాడికి దోచుకున్నారని, దోపిడీకి గురైన వందల కోట్ల విలువైన క్వార్ట్జ్‌కు సంబంధించి రికవరీ మాత్రం జరగలేదని ఆయనన్నారు.

## ప్రజా సంక్షేమంలో..
# బ్యాంకర్ల పాత్రే కీలకం
### కలెక్టర్ హిమాన్షు శుక్లా



ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో బ్యాంకర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు సమయానుకూలంగా వారి అవసరాలకు తగ్గట్టుగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు రొటావేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, కట్టర్స్ మొదలైన యంత్ర పరికరాల కొనుగోలుకు రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో వున్న సాగులో లేని 70వేల ఎకరాల భూమిని సాగులోనికి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని, అందుకు బ్యాంకర్లు తమ వంతు చేయూతనందించాలన్నారు. అదేవిధంగా, చిరువ్యాపారులకు ప్రధానమంత్రి ముద్రా యోజన రుణాలు, స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబనకు రుణాలు ఇవ్వాలని సూచించారు. విద్యారుణాలను విరివిగా మంజూరు చేసి విద్యార్థులకు చేయూతనివ్వాలన్నారు. పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రోత్సహించేలా రుణాలివ్వాలని తెలిపారు. ఆ పథకంపై స్వయంసహాయక మహిళలకు అవగాహన కల్పించాలని డిఆర్‌డిఏ పీడిని ఆదేశించారు. లీడ్ డిస్ట్రిక్ట్‌మేనేజర్ మణిశేఖర్, జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, తదితర అధికారులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అగ్నిబాధితులకు అండగా మంత్రి నారాయణ



నెల్లూరులోని సంతపేట మార్కెట్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులకు రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ అండగా నిలిచారు.. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వారికి ఆర్థిక భరోసా కల్పించారు. అసెంబ్లీ సమావేశాలలో ఆయన బిజీగా ఉన్నప్పటికీ..స్థానిక టీడీపీ నేతలు ఇచ్చిన సమాచారంతో సంతపేట వస్త్ర వ్యాపారులకు చేయూతనందించారు. ఈ ప్రమాదంలో 8 షాపులు అగ్నికి ఆహుతి కావడంతో, నష్టపోయిన వారికి 50వేలు వంతున ఆర్థిక సాయం ప్రకటించారు. స్వల్పంగా దెబ్బతిన్న మరో 12 షాపులకు 25 వేల రూపాయల లెక్కన, పొగలతో బీటలు వచ్చిన మరో 30 షాపులకు పదివేల రూపాయలు వంతున సహాయాన్ని ప్రకటించారు. కప్పిర శ్రీనివాసులు తదితర స్థానిక టీడీపీ నాయకుల సాయంతో మరో లక్ష రూపాయలను వారికి ఆర్థిక సాయంగా అందజేశారు. బాధిత కుటుంబాల వారికి ముందుగా బియ్యం బస్తాలు, దుస్తులను అందజేశారు. కార్పొరేషన్ కమిషనర్ నందన్‌తో పాటు టీడీపీ నాయకులు సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు 54 కేంద్రాలు

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధమయ్యారు. ఎడగారు వరిపంటకు కనీస మద్దతు ధర ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలుగా ప్రభుత్వం తరఫున తాజాగా జిల్లాలో 54 కేంద్రాలు ఏర్పాటుచేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో ఇటీవల ఆమేరకు సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సహకారశాఖ అధికారి గురప్ప మాట్లాడుతూ, ఈ 54 ధాన్యం కొనుగోలు కేంద్రాలను 41 ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాలు నిర్వహిస్తాయని, మొత్తం 2,11,703 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అర్జున్‌రావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్‌కుమార్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ సరిత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అరుణమ్మ నేతృత్వంలో.. జిల్లాలో ఎంతో అభివృద్ధి
### జడ్పీ సీఈఓ మోహన్‌రావు



జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా ఆనం అరుణమ్మ పదవీ బాధ్యతలు స్వీకరించి సెప్టెంబర్ 25వ తేదీ నాటికి నాలుగేళ్ళ పదవీ కాలం పూర్తి చేసుకొని 5వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆనం అరుణమ్మకు ధన్యవాదాలు తెలియజేస్తూ సభను నిర్వహించారు. జడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, అన్ని విభాగాల సిబ్బందితో కలిసి కేక్ కట్‌చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నాలుగు సంవత్సరాలలో జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగుల ప్రమోషన్లు, కారుణ్య నియామకాలు తదితర అంశాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి, అన్ని విధాలుగా జిల్లాను ముందడుగు వేయించేందుకు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, నాలుగేళ్ళ తన పదవీ కాలంలో జిల్లావ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు, ఉద్యోగుల సమస్యలు తీర్చేందుకు తనకు సహకరించిన జడ్పీ సభ్యులకు, జడ్పీ సీఈఓకి, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

# కోటంరెడ్డి పుట్టినరోజున.. వేదగిరిపై పూజలు



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 26న రూరల్ నియోజకవర్గ పరిధిలోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో, శ్రీధర్ రెడ్డి సోదరుడు, టీడీపీ నాయకుడు కోటం రెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని, ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించేందుకు ఆ భగవంతుని ఆశీస్సులు ఆయనకు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, ఏఎంసీ ఛైర్మెన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌ఛార్జి దాట్ల చక్రవర్తిరెడ్డి, ఏఎంసీ వైస్‌ఛైర్మెన్ రాపూరు శేఖర్, వేణు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీతో ప్రజలకు లబ్ధి.. వ్యాపారాలు వృద్ధి!

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 22వ డివిజన్‌లో ఇటీవల జీఎస్‌టీ 2.0 సంస్కరణలపై స్థానిక ప్రజలకు, వ్యాపారులకు, దుకాణాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని, కేంద్రప్రభుత్వం జీఎస్‌టీ 2.0తో అనేకరకాల వస్తువుల ధరలు తగ్గి సామాన్య ప్రజలకు ఊరట కలుగుతోందని తెలిపారు. జీఎస్‌టీ తగ్గడం వల్ల స్థానికంగా వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, జలదంకి సుధాకర్, మూలే విజయభాస్కర్ రెడ్డి, 22వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీని సద్వినియోగం చేసుకోండి



కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జీఎస్టీ 2.0ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. ఇటీవల నెల్లూరులో వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో ర్యాలీని ఆయన ప్రారంభించారు. జీఎస్టీ వినియోగంపై ప్రజలలో అవగాహన పెంపొందించుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గుదల వల్ల కొన్ని నిత్యావసర వస్తువులు మరియు వైద్య రంగంలో మందుల ధరలు తగ్గుతాయని ఆయన తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### శ్రీ రాజరాజేశ్వరమ్మవారికి..

## పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు



దేవీశరన్నవరాత్రుల పర్వదినాల సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరమ్మ దేవాలయం నిత్యం వేలాదిమంది భక్తులతో కళకళలాడుతోంది. ఈ ఆలయంలో నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు రోజుకో అలంకారంతో శోభాయమానమై భక్తులకు దర్శనమిస్తున్నారు. సెప్టెంబరు 28న అమ్మవారికి శ్రీ కాళికాదేవి అలంకారాన్ని నిర్వహించారు. ఆ రోజు సాయంత్రం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి-సుజిత దంపతులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి వారిని సాదరంగా స్వాగతించి అమ్మవారి వద్ద పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఉత్సవ కమిటీ ఛైర్‌పర్సన్ ఏలూరు శిరీష, వైస్ ఛైర్మెన్ జి.దొరబాబు, ఉత్సవకమిటీ కార్యదర్శి బిరుదవోలు చంటి, సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

### ఆల్తూరు సోదరుల పూజలు...



ఇదేరోజున దేవాలయ విమాన గోపురం, సాలాహార నిర్మాణ దాతలు ఆల్తూరు సోదరులు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, ఆల్తూరు మహేష్ కుమార్‌రెడ్డి శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దాతలను ఆలయ ఇఓ కోవూరు జనార్దన్‌రెడ్డి స్వాగతించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

## దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

ఇంటర్ విద్యార్థులకు అక్టోబరు 5వతేదీ వరకు దసరా సెలవులున్నాయని, ఆరోజుల్లో వారికి ఎలాంటి తరగతులు నిర్వహించొద్దని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు టి.వరప్రసాదరావు తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే, ఆయా కళశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



### దుర్గాష్టమి సందర్భంగా..

## అమ్మవారికి ఆనం పూజలు

దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 30వ తేదీ మంగళవారం నాడు నెల్లూరు దర్గామిట్టలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం చేయించి, ప్రత్యేకపూజలు నిర్వహింపజేశారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి గుడి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో 5 కోట్ల రూపాయల వ్యయంతో ధ్యాన మందిరం మరియు కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. అందులో కోటి రూపాయలను దాతలు సమకూరుస్తారని, మిగిలిన నాలుగు కోట్లను దేవాదాయ శాఖ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితోపాటు ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కి..రెడ్‌క్రాస్ ప్రతినిధుల శుభాకాంక్షలు



జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ హిమాన్షు శుక్లాను సెప్టెంబర్ 27న జిల్లా రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు అభినందించారు. కమిటీ అధ్యక్షుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

## ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఆసుపత్రులు, క్లినిక్ నిర్వాహకులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు పొంది ఉండాలని, అందుకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కమిషనర్ వైఓ నందన్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆలిండియా మెడికల్ అసోసియేషన్ సభ్యులు, వైద్యులతో సమావేశమయ్యారు. ట్రేడ్ లైసెన్సుల బకాయిలు సుమారు రూ. 36 కోట్ల వరకు ఉన్నాయని, వాటిని చెల్లించేందుకు కృషి చేయాలని కోరారు.

## యశ్వంత్‌సింగ్‌కి సముచిత స్థానం



బీజేపీ అనుబంధశాఖ బీజేవైఎం యువ నాయకుడు యశ్వంత్ సింగ్‌కి సముచితస్థానం లభించింది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో, నేషనల్ యూత్ క్రాఫ్ట్ పథకం కింద 'మై భారత్ యూత్ వలంటీర్ల ఎంపిక కమిటీ'లో సభ్యునిగా ఆయన నియమితులయ్యారు. తనను ఆ కమిటీలో నియమించేందుకు సహకరించిన నాయకులకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## జడ్పీలో కారుణ్య నియామకాలు

జడ్పీలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు జడ్పీలో కారుణ్య నియామకాలు చేస్తుండడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల 8 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరికి టైపిస్టులుగా ఉద్యోగాలిచ్చారు. ఆ మేరకు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఇఓ మోహన్ రావు వారికి నియామక పత్రాలను అందజేశారు. పలువురు ఉద్యోగసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### గుండె వ్యాధులపై..

## 'కిమ్స్' వైద్యుల అవగాహన ర్యాలీ



ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండె వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించేందుకు నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు సెప్టెంబరు 29న నగరంలో 3-కే వాక్ నిర్వహించారు. గుండెకి సంబంధించిన సమస్యల పట్ల నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. గుండె జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన ఆహార నియమాలు, శారరీక వ్యాయామాలను ఈ సందర్బంగా వైద్యులు వివరించారు. ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సతీష్ కుమార్, హెచ్ఓడి-చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ సీఎస్ శ్రీనివాసరాజు, సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ సాహెబ్, డాక్టర్ హెచ్.నాగరాజా రావు, సీనియర్ కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ వి.లోకేష్, సీనియర్ జనరల్ సర్జన్ డాక్టర్ వి.జగదీష్, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, బొల్లినేని నర్శింగ్ కళాశాల విద్యార్థులు మొత్తం సుమారు 4 వందల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుండె వ్యాధిగ్రస్తులకు తమ ఆసుపత్రిలో అందజేస్తున్న వైద్యసేవలను వైద్యనిపుణులు వివరిస్తూ, మహానగరాలకు ధీటుగా కిమ్స్‌లో గుండెవ్యాధులకు అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

## సుధాకరప్రసాద్ సేవలు చిరస్మరణీయం



ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాలను ఒకే తాటిపైకి తెచ్చి తన పోరాట పటిమతో ఎన్నో హక్కులు సాధించిన దివంగత తోట సుధాకరప్రసాద్ చిరస్మరణీయులని ఏపీఆర్ఎస్ఓ నాయకుడు అల్లంపాటి పెంచలరెడ్డి కొనియాడారు. నెల్లూరు, బీవీ నగర్‌లో సుధాకరప్రసాద్ వర్ధంతిరోజైన సెప్టెంబరు 28న కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. నెల్లూరుజిల్లా కలువాయి మండలం కుల్లూరుకు చెందన సుధాకరప్రసాద్ సేవలను ప్రస్తుతిస్తూ, ఆయన సతీమణి కామాక్షమ్మ రాసిన 'విక్రమసింహపురి వీరసింహం' పుస్తకాన్ని ఈ సందర్భంగా వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు శరత్‌బాబు, వెంకయ్య, నాగేశ్వరరావు, నర సింహులు తదితరులు పాల్గొన్నారు.

## టైలర్ల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

- టైలర్ల ఫెడరేషన్ చైర్మెన్ హర్షం



కూటమి ప్రభుత్వం టైలర్ల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర టైలర్ల ఫెడరేషన్ ఛైర్మెన్ ఏ.స్వామి తెలిపారు. నెల్లూరులోని టైలర్లతో ఇటీవల ఆయన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టైలర్ల సంక్షేమానికి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుండడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి టైలర్ల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వానికి తెలియజేస్తానన్నారు. ప్రభుత్వ టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. జీఎస్టీ తగ్గించినందువల్ల ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉందని, వినియోగదారునికి కొనుగోలు శక్తి పెరిగి డబ్బు చలామణితో మార్కెట్లు కళకళలాడుతున్నాయన్నారు. అనంతరం ఆయన్ను పలువురు టైలర్లు ఘనంగా సత్కరించారు. టైలర్ల సంఘం అధ్యక్షులు గులాం ఖాదర్‌బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, రేఖ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు యానాదయ్య, ట్రెజరర్ బాబు తదితరులు పాల్గొన్నారు.







## పులికాట్ పరిసరాల్లో..
# విస్తారంగా తాటిమొక్కల పెంపకం!

### • శ్రీసిటీ - 'కొబెల్కో ఇండియా' శ్రీకారం

పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అత్యంత కీలకమైన వృక్ష సంపదగా తాటిచెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని జపాన్‌కి చెందిన కొబెల్కో గ్రూప్ అనుబంధ సంస్థల వారు తెలిపారు. కొబె స్టీల్ 120వ వార్షికోత్సవం మరియు కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (కేసీఇఎల్) శ్రీసిటీ ప్లాంట్ 15వ వార్షికోత్సవం ఇటీవల శ్రీసిటీ ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకహషి, కాన్సుల్ నవోకో యుజావా, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కొబెల్కో ఆగ్నేయాసియా మేనేజింగ్ డైరెక్టర్ కసమోరి, కేసీఇఎల్ మేనేజింగ్ డైరెక్టర్–సీఇఓ హయామా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఇఎల్ ఆర్దే ఫౌండేషన్‌తో కలిసి పెద్ద ఎత్తున తాటిచెట్ల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీసిటీ మరియు పులికాట్ సరస్సు పరిసరాల్లో 10వేల తాటి మొక్కలను నాటడం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. తాటిచెట్ల పెంపకం ద్వారా జీవవైవిధ్యం, పర్యావరణం పట్ల కొబెల్కో సంస్థ నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోందని పరిశ్రమ వర్గాలు కొనియాడాయి.

### లక్ష మొక్కలు నాటేందుకు సహకరిస్తాం - శ్రీసిటీ ఎం.డీ

కొబెల్కో చేపట్టిన పర్యావరణ ప్రగతిలో ఇదో మైలురాయి అని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. ఆ కంపెనీ సిఎస్సార్ చొరవను, పర్యావరణ దృష్టిని ప్రశంసించారు. మన నిత్య జీవితంలో తాటిచెట్లకు ఎంతో ప్రాధాన్యత ఉందని, తాటిచెట్లంటే ఆంధ్రుల కల్పవృక్షాలని ఆయన అంటూ, కొబెల్కో మొక్కల నాటే కార్యక్రమం 10వేల నుంచి లక్షకు విస్తరించేలా తమ సహకారం అందిస్తామని ప్రకటించారు. శ్రీసిటీలో ఇతర జపనీస్ సంస్థలు కొబెల్కో స్ఫూర్తితో ఈ తరహా పర్యావరణహిత సిఎస్సార్ చర్యలకు చొరవ చూపాలని ఆయన కోరారు. కొబెల్కో ఆగ్నేయాసియా మేనేజింగ్ డైరెక్టర్ కసమోరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవకులకు.. వస్త్ర బహుకరణ

### • వేమిరెడ్డి దంపతుల వితరణ



తిరుమల శ్రీ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి సేవలందిస్తున్న టీటీడీ సిబ్బందికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు, టీటీడీ పాలక మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు ఏటా వస్త్రాలను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈసారి కూడా బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వేమిరెడ్డి దంపతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు చేతులమీదుగా వారు టీటీడీ సిబ్బందిని, వేద పండితులు, అర్చకులు, లడ్డూ పోటు కార్మికులు, కల్యాణకట్టలో విధులు నిర్వహించే సిబ్బంది, తదితర విభాగాలవారందరినీ నూతన వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు మాట్లాడుతూ, గత 6 సంవత్సరాలుగా టీటీడీ ఉద్యోగులకు వస్త్ర బహుకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, స్వామివారికి సేవలు చేసే వారికి సేవ చేయడం చాలా సంతోషంగా ఉంటుందన్నారు.

## కోలాటంలో విపిఆర్, ప్రశాంతమ్మ






శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా విపిఆర్ దంపతులు శ్రీవారి వాహనసేవల్లో పాల్గొన్నారు. సింహవాహనసేవ, ముత్యపు పందిరి వాహనం, కల్పవృక్షవాహనం, తదితర వాహనాలపై కొలువుదీరిన దేవదేవుని దర్శించుకుని తరించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వారు శ్రీవారిని ప్రార్థించారు. ముత్యపు పందిరి వాహన సేవలో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ, గరుడ వాహన సేవలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తిరుమల మాడ వీధుల్లో నృత్యాలు చేస్తున్న భక్తులతో కలిసి కోలాటంలో పాల్గొన్నారు.


సెప్టెంబర్ 29న బోర్డు ఛైర్మన్ బి.ఆర్ నాయుడుతో కలిసి టిటిడి తరఫున కొల్హాపూర్ మహాలక్ష్మీ అమ్మవారికి వేమిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.







## సచివాలయ ఉద్యోగల
# సమస్యలు తీర్చాలి
### శాసనమండలిలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల ఆయన శాసనమండలిలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. వలంటీర్లను తొలగించి ఆ పనులన్నింటిని సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారని.. దీంతో సచివాలయ ఉద్యోగులకు పనిభారం ఎక్కువైందని ఆయన తెలిపారు. రోజుకో సర్వే పేరుతో సచివాలయ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని, దీంతో ఒత్తిడి, అధిక పనిభారం తట్టుకోలేక.. సచివాలయ ఉద్యోగులు ఆవేదన, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, వారి సమస్యలు తీర్చాలని, పనిభారం తగ్గించాలన్నారు. ప్రస్తుతం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు అమలవుతున్న రికార్డ్ అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు.

## పొదలకూరులో...
# జాబ్‌మేళాకు మంచి స్పందన



మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో ఇటీవల మండల కేంద్రమైన పొదలకూరులో చేపట్టిన జాబ్‌మేళాకి విశేష స్పందన లభించింది. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, సోమిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త జరిగిన ఈ జాబ్ మేళాకి 254 మంది హాజరయ్యారు. 14 కంపెనీల వారు ఆ అభ్యర్థులకు పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ఉత్తీర్ణులైనవారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. వచ్చినవారిలో అర్హులైన 125 మందికి ఉద్యోగాలను ఖరారు చేస్తూ నియామక పత్రాలను ఇస్తున్నారు. దీంతో ఆ ప్రాంత యువత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి వారు ధన్యవాదాలు చెప్తున్నారు.

# రెడ్‌క్రాస్‌లో..రేబిస్ నివారణ దినం



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా శాఖ ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ ఏఆర్‌వి క్లినిక్‌లో సెప్టెంబరు 28న పపంచ రేబీస్ నివారణ దినోత్సవం జరిగింది. రేబిస్ వ్యాధి నివారణకు టీకాను కనుగొన్న లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్ధంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28ని ప్రతి ఏడాది రేబిస్ వ్యాధి నివారణ దినంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారుగా 60వేల మందికిపైగా రేబిస్ వ్యాధితో మరణిస్తున్నారని, అందులో సుమారు 20వేల మంది మనదేశంలోనే చనిపోతున్నారని ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. నెల్లూరు రెడ్ క్రాస్‌లోని ఏఆర్‌వి వ్యాక్సిన్ సెంటర్‌లో రోజుకు 50 నుండి 60 మందికి రేబిస్‌వ్యాధి నివారణకు టీకాలు, సంవత్సరానికి సుమారుగా 17వేల మందికి వ్యాక్సినేషన్ అతి తక్కువ ధరతో చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఏఆర్‌వి కమిటీ సభ్యులు రాఘవేంద్రరావు, పి.ఎల్లయ్య, బి.విజయ్‌కుమార్‌రెడ్డి, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

# గాజాలో శాంతి సుమం వికసిస్తుందా?

మనసులో మాట 65

ఇజ్రాయెల్-హమాస్ సంఘర్షణతో గాజాలో నరమేధం జరుగుతూ వేలమంది చనిపోతూ లక్షల మంది నిరాశ్రయులవుతున్న వేళ ట్రంప్ సరికొత్త శాంతి ఒప్పందంతో ముందుకొచ్చారు. 21 సూత్రాలతో కూడిన ఈ శాంతి ఒప్పందంపై దాదాపుగా ప్రపంచమంతా హర్షం వ్యక్తం చేసింది. భారత్ కూడా ఈ ఒప్పందాన్ని స్వాగతించింది. పాలస్తీనా-ఇజ్రాయెల్ దీర్ఘకాలిక సమస్యకు అది ఇప్పటికిప్పుడు పరిష్కారం చూపకపోయినా తాత్కాలికంగా శాంతి నెలకొల్పే దిశగానే ఉంది. ముఖ్యంగా ఎవరు ఎంత చెప్పినా యుద్ధం ఆపని నెతన్యాహు ఈ ప్రతిపాదిత ఒప్పందానికి సానుకూలంగా స్పందించడం మంచి పరిణామం. అరబ్బు దేశాలు కూడా ఈ ఒప్పందాన్ని స్వాగతించాయి. ముఖ్యంగా అమెరికా మిత్రదేశమైన ఖతార్ సానుకూలంగా స్పందించింది. ఖతార్ పై ఇజ్రాయెల్ దాడికి నెతన్యాహు క్షమాపణలు చెప్పడంతో ఖతార్ కూడా శాంతించింది.

క్లుప్తంగా చెప్పాలంటే ట్రంప్ చేసిన ప్రతిపాదన ప్రస్తుతం గాజాలో కొనసాగుతున్న యుద్ధానికి విరమణ, బందీల మార్పిడి, హమాస్ సైనిక సామర్థ్య నిర్మూలన, అంతర్జాతీయ పర్యవేక్షణ, గాజా పునర్నిర్మాణంపై దృష్టి సారిస్తుంది.

గాజాలో హమాస్ స్థావరాలుగా ఉన్న సొరంగాలు, ఇతర సైనిక మౌలిక సదుపాయాలను నిర్మూలించాలన్నప్రతిపాదన ఉండడం, ఇప్పటికిప్పుడు ఇజ్రాయెల్ సైనిక బలగాలను ఉపసంహరించడం కాకుండా దశల వారీగా ఉపసంహరణకు అనుమతించడం వంటి అంశాలతో నెతన్యాహు సంతృప్తి చెందారు. హమాస్ ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తే ఇజ్రాయెల్ "పనిని పూర్తి చేస్తుంది" అనే నిబంధనలు నెతన్యాహు కూటమిలోని అతివాదులకు ఆకర్షణీయంగా ఉన్నాయి.

అరబ్ దేశాలు, ఎప్పటి నుండి రహస్య దౌత్యంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ట్రంప్ ప్రణాళికకు ఊహించని విధంగా సానుకూల స్పందనను ఇచ్చాయి. దీనిని ప్రాంతీయ స్థిరత్వానికి ఒక ఆచరణీయ అడుగుగా అరబ్బు దేశాలు చూస్తున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE), సౌదీ అరేబియా, ఈజిప్ట్ జోర్డాన్ నాయకులు ఈ దీర్ఘకాలిక ప్రణాళికకు ఆర్థిక సహాయం, భద్రతా సహకారం అందిస్తామని ప్రకటనలు జారీ చేశారు.

ట్రంప్ ప్రతిపాదనల్లో ఒక ముఖ్యాంశం, గాజా పరిపాలనను ఎటువంటి రాజకీయ అజెండా లేని స్థానిక టెక్నోక్రాట్లకు అప్పచెప్పడం. వీరికి అమెరికా యంత్రాంగం, అంతర్జాతీయ సమాజం తగిన మద్దతు ఇస్తుంటుంది. హమాస్‌ను పరిపాలనకు దూరంగా ఉంచడం ఇజ్రాయెల్‌కు బాగా నచ్చిన అంశం. ఉపాధి అవకాశాలకు ప్రత్యేక ఆర్థిక మండలి సృష్టి ఒక ముఖ్యాంశం. దీనివల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి యువత ఉగ్రవాదం వైపు మళ్లకుండా ఉండే అవకాశం ఉంది. పునరావాసం కోసం చక్కటి పట్టణ ప్రణాళికను కూడా సిద్ధం చేయనున్నట్లు ఈ ఒప్పందంలో ఉంది. ఈ రెండు అంశాలు అరబ్‌దేశాల నగరాభివృద్ధి నైపుణ్యంతో సరిపోలుతాయి. శరణార్థుల ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఈజిప్ట్, జోర్డాన్‌లు... ఐక్యరాజ్య సమితి, రెడ్ క్రాస్ ద్వారా తటస్థ సహాయ పంపిణీ, అలాగే అమెరికా-అరబ్-యూరోపియన్ కమిటీ పర్యవేక్షణలో తాత్కాలిక టెక్నోక్రాటిక్ పాలనను స్వాగతించాయి.

ప్రతిపాదిత ఒప్పందంలోని మరో ముఖ్యాంశం.. పాలస్తానా. పాలస్తీనియన్ అథారిటీ (PA) అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్ ఈ ప్రణాళికను "ముందడుగు"గా ప్రశంసించారు, కానీ సంస్కరణలపై అస్పష్టత ఉందన్నారు. ప్రతిపాదిత ఒప్పందం పాలస్తీనా దేశం స్థాపనను స్పష్టంగా ఆమోదించలేదు. అయితే, ఆ ప్రత్యేక పాలస్తీనా ఏర్పాటుకు మార్గం తెరిచే ఉంచింది. గట్టి హామీ మాత్రం ఇవ్వలేదు. గాజా పునర్నిర్మాణం ఊపందుకున్న తర్వాత, పాలస్తీనా అథారిటీ సంస్కరణల కార్యక్రమం పూర్తయిన తర్వాత పాలస్తీనా దేశ స్థాపన దిశగా మార్గం సుగమం చేయడానికి తగిన పరిస్థితులు ఏర్పడతాయి అని మాత్రమే ఈ ప్రతిపాదిత ఒప్పందంలో ఉంది. పాలస్థీనా అథారిటీ సంస్కరణల గురించి ఈ ప్రతిపాదిత ఒప్పందలో స్పష్టతలేదు. దానికి కాలపరిమితి కూడా పేర్కొనలేదు. అటు అరబ్బు దేశాలకు, ఇటు అమెరికా, ఇజ్రయెల్ దేశాలకు అనుగుణంగా ఉంటూ, హమాస్ వంటి అతివాద, ఉగ్రవాద సంస్థలకు చోటు లేకుండా చేయడం ఈ సంస్కరణల ముఖ్య ఉద్దేశం కావచ్చు.

పాలస్తీనాను గుర్తించే దేశాల సంఖ్య కూడా పెరుగుతుండడం ట్రంప్ త్వరగా ఒక శాంతి సూత్రంతో ముందుకు రావడం కారణం. ఐక్యరాజ్యసమితిలోని 193 సభ్య దేశాలలో, ఇప్పుడు మొత్తం 153 దేశాలు అధికారికంగా పాలస్తీనాను గుర్తించాయి. ముఖ్యంగా యూరోపియన్ దేశాలు పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించాయి. ఈ తాజా మార్పు యునైటెడ్ కింగ్‌డమ్‌తో మొదలయింది. "మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భయానక పరిస్థితుల దృష్ట్యా, శాంతిని నెలకొల్పడానికి 'రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం(Two-state solution) దిశగా చర్యలు తీసుకుంటున్నాము" అని ప్రధాని కీర్ స్టార్మర్ చెప్పారు. ఆ తర్వాత కెనడా, ఆస్ట్రేలియా, పోర్చుగల్ దేశాలు కూడా అదే బాట పట్టాయి. సెప్టెంబర్ 22న, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కూడా ఇదే నిర?యాన్ని ప్రకటించారు, అలాగే మాల్టా, మొనాకో, లక్సెంబర్గ్, శాన్ మారినో కూడా ఇలాంటి నిర?యాలనే ప్రకటించాయి. ఇటీవల ఐరాస సర్వసభ్య సమావేశం సందరరేగా, సౌదీ అరేబియా, ఫ్రాన్స్‌ల సహ-అధ్యక్షతన 'పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం, రెండు దేశాల ఏర్పాటు ద్వారా పరిష్కారం అమలు కోసం ఉన్నత-స్థాయి అంతర్జా తీయ సమావేశం' అనే అంశంపై భేటీ జరిగింది. ఈ సమావేశంలోనే పాలస్తీనాను గుర్తిస్తూ పలు దేశాలు ప్రకటనలు చేశాయి. మొత్తంమీద, ఐరాసలోని 80 శాతం దేశాలు ఇప్పుడు పాలస్తీనాను గుర్తించడంతో ట్రంప్ చొరవ తీసుకోక తప్పింది కాదు. పైగా ఆయన నోబెల్ శాంతి బహుమతిపై కన్నేశారు కూడా. శాంతి కోసం శాంతి కాకుండా బహుమతి కోసం శాంతి అన్న మాట. ఏదయితే ఏమిలే. ఆ ప్రాంతంలో శాంతి నెలకొంటే అదే చాలు.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




### ఆటో కార్మికుల ఆందోళన

జిల్లాలోని ఆటో కార్మికులు ఇటీవల నగరంలో ఆందోళన నిర్వహించారు. వాహనమిత్ర పథకానికి ఎలాంటి షరతులు విధించవద్దని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రదర్శన చేశారు. స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి వీఆర్‌సి కూడలి వరకు జరిగిన ఈ ప్రదర్శనలో నాయకులు మాట్లాడుతూ, అనేక నిబంధనలు పెట్టడంతో అధికశాతం మంది ఆటోకార్మికులు ఆ పథకాన్ని పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సులు ఉన్నవారందరికీ ఆ పథకం వర్తింపజేయాలని కోరారు. ఆటో కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, అధ్యక్షుడు రాజా, సీఐటియు నాయకుడు శ్రీనివాసులు, సూర్యనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### కనీస వసతులకోసం రోడ్డెక్కిన మహిళలు

కుళాయిల్లో నీళ్లు కుళ్లుకంపు కొడుతున్నాయి.. పారిశుద్ధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ అన్నీ అస్తవ్యస్థంగా ఉన్నాయి.. దోమలు కుప్పలు తెప్పలు.. ఎలా బతకాలంటూ నెల్లూరులో సెప్టెంబరు 29న ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేశారు. 53వ డివిజన్ వెంకటేశ్వరపురం సచివాలయం వద్ద జరిగిన ఈ ఆందోళనలో ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ, డివిజన్ నాయకురాలు మహ్మదా తదితరులు మాట్లాడుతూ, కుళాయిల్లో కలుషితమైన నీళ్లు వస్తున్నాయని, పలుమార్లు సచివాలయ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస వసతులు కల్పించకుండా ఇబ్బందుల పెడుతున్నారని ఆందోళన చెందారు. చిన్నచిన్న సమస్యలను కూడా తీర్చకపోతే ఎలా?.. అంటూ వారు మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్థానికంగా ఉండే సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఐద్వా నాయకురాళ్ళు భార్గవి, లక్ష్మి, షాహిన్, రాజేశ్వరి, షబ్బీర, సుశీలమ్మ, ధనమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు తీర్చాలంటూ నేతకారుల వినతి

జిల్లాలో చేనేతకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలించి, సత్వరం పరిష్కరించాలంటూ సెప్టెంబరు 27న చేనేతకారుల నాయకులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకి వినతిపత్రం అందజేశారు. ఎంతోకాలంగా నేతకారులు జీవితాలు సమస్యలకు నిలయాలుగానే ఉంటున్నాయని వారు ఆవేదనతో చెప్పారు. చేనేత సంఘాల నేతలు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్ర, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, జిల్లా చేనేత విభాగం కన్వీనర్ ఆశం సురేష్, కార్తీక్ తదితరులు కలెక్టర్‌ని కలసి, నేతకారుల కష్టాలు తీర్చండంటూ విజ్ఞప్తి చేశారు. తమ వినతిని పరిశీలించి, త్వరలోనే సమస్యలు తీరుస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని వారు సంతోషం వ్యక్తం చేశారు.

### బాక్స్‌టైప్ బ్రిడ్జి కోసం సీపీఎం ధర్నాందోళన

నెల్లూరులోని కొండాయపాళెం రైల్వే గేటు వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జిని నిర్మించి ప్రజల ఇబ్బందులు తీర్చాలంటూ సీపీఎం 20, 21వ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో సెప్టెంబరు29న కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన నిర్వహించారు. వనంతోపు కూడలి వద్ద నుంచి కొండాయపాళెం గేటు వరకు స్థానికులతో కలసి ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రాంతమంతా బాగా అభివృద్ధి చెందుతోందని, నిత్యం వేలాది వాహనాలు ఈ దారిగుండా ప్రయాణిస్తుంటాయని సీపీఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఎక్కువ సమయం గేటు మూసివేయాల్సి వస్తుండడంతో, రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని, గతంలో ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జిని నియమించాలని అనుకున్నా, అది ఆచరణ సాధ్యం కాదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మించడమే శ్రేయస్కరమన్నారు. ఆమేరకు సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. ఆ పత్రాలను జిల్లా కలెక్టర్‌కి అందజేశారు. సీపీఎం రూరల్ మండల కార్యదర్శి కొండా ప్రసాద్, సభ్యులు పోతురాజు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కార్యదర్శులు రమణయ్య, రత్నం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆతిథ్య రంగంలో అవార్డులు అందుకున్న

# శ్రీసిటీ 'మ్యాంగో రిసార్ట్' - విజయవాడ 'తాజ్ వివాంట'





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక రంగం ఎంపిక చేసిన 2024–25 పర్యాటక ఎక్సలెన్సీ అవార్డులలో "ఉత్తమ థీమ్–బేస్ట్ రిసార్ట్" అవార్డును శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్ దక్కించుకుంది. వరుసగా రెండవ ఏడాది కూడా శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కి రాష్ట్ర ప్రభుత్వ పర్యాటకరంగ ఉత్తమ అవార్డు రావడం విశేషం. శ్రీసిటీ లోని ఈ రిసార్ట్ అమలుచేస్తున్న స్థిరమైన, ఆకర్షణీయమైన ఆతిథ్య సేవలకు ఈ గుర్తింపు దక్కింది. మ్యాంగో రిసార్ట్ తరఫున రిసార్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు ఆ అవార్డును అందుకున్నారు.

**ఉత్తమ సేవా అవార్డు అందుకున్న 'తాజ్ వివాంట'**

విజయవాడ నగరంలో గత 18 సంవత్సరాలకు పైగా ఉత్తమ సేవలందిస్తున్న నెల్లూరీయులకు చెందిన 'తాజ్ వివాంట' కూడా ఈ ఏడాది అత్యుత్తమ ఆతిథ్య సముదాయంగా అవార్డు అందుకుంది. ఈ హోటల్ ప్రారంభించినప్పటి నుండి అనేక సందర్భాల్లో పలు ఉత్తమ సేవా అవార్డులను అందుకుంటూనే ఉంది. 'టాటా' సంస్థల దిగ్గజం రతన్ టాటా కూడా ఈ హోటల్‌లో బసచేసి ఉండడం విశేషం! 2014లో ఉమ్మడి రాష్ట్రం విడిపోయి ఆంధ్రప్రదేశ్ కొత్తగా ఏర్పడ్డ తరుణం నుంచి అనేక మంది రాజకీయ నాయకులకు, ఉన్నతాధికారులకు ఎంతోమంది గవర్నర్లకు, జాతీయ అంతర్జాతీయ ప్రముఖులకు 'తాజ్ వివాంట' ఆతిథ్యమిచ్చింది. అక్కడ ప్రభుత్వానికి ఎలాంటి వసతి సౌకర్యాలు లేని తరుణంలో వివిధ సమావేశాలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు ఈ హోటలే వేదికగా నిలిచింది. విజయవాడలో అనేక కొత్త ఆతిథ్య సముదాయాలు ఆవిష్కరింపబడినప్పటికీ, మన నెల్లూరీయులకు చెందిన 'వివాంట' ఆతిథ్యంలో ప్రత్యేక స్థానాన్ని పొందడం, ఇప్పటికీ అదే ఆదరణతో కొనసాగడం విశేషం! హోటల్ వ్యవస్థాపకులు, మన నెల్లూరీయులు మలినేని రాజయ్య, హోటల్ జనరల్ మేనేజర్ నగేష్‌కుమార్ ఈ ఏడాది లభించిన అవార్డును స్వీకరించారు.

ఇటీవల విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం–2025 వేడుకల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, పర్యాటక శాఖ మంత్రి కె.దుర్గేష్, సీనియర్ ప్రభుత్వ అధికారులు హాజరైన కార్యక్రమంలో శ్రీసిటీ ప్రతినిధులకు, 'తాజ్ వివాంట' యాజమాన్యానికి ఈ అవార్డులను ప్రదానం చేశారు.

## ఆందోళన పడకండి..

# అండగా ఉంటా!

**○ పార్టీ శ్రేణులకు రామ్‌కుమార్‌రెడ్డి భరోసా**



కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఆందోళనపడవద్దని, అన్నివేళలా వారికి, పార్టీకి తాను అండగా ఉంటానని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలన పట్ల ఇప్పటికే రాష్ట్రంలో వ్యతిరేకత ప్రారంభమైందని, రానున్న ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను సక్రమంగా అమలు చేయకుండా కూటమి నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో ప్రభుత్వం అమలు పరచడం మర్చిపోయి వైయస్సార్సీపీ శ్రేణులు నాయకులను ఇబ్బందులకు గురిచేసి, అక్రమ కేసులు బనాయిస్తోందని ఆయన విమర్శించారు. ఇకనైనా వారి తీరు మారాలన్నారు. ఎన్ని కేసులు పెట్టినా వైసీపీ కార్యకర్తలు నాయకులు భయపడే ప్రసక్తే లేదన్నారు. జగన్‌ని మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

# పంబలేరు బ్రిడ్జిని పూర్తిచేయండి

**-- ముఖ్యమంత్రికి విన్నవించిన ఎమ్మెల్యే పాశిం --**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఇటీవల విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసిన గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, గూడూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పంబలేరు బ్రిడ్జిని వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిందని, 9 కోట్ల నిధులు మంజూరు చేసి ఆ బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గూడూరు 1వ పట్టణం 2వ పట్టణాలను కలిపేలా ఏర్పాటు చేస్తున్న ఫ్లైఓవర్ పనులు అధికారులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, కండలేరు డ్యాం నుండి 2 టీఎంసీల నీటిని విడుదలచేసి వాకాడు, కోట మండలాలలో సాగు, త్రాగునీటి అవసరాలు తీర్చాలని, యల్లసిరి కాలువ పనులు పూర్తి చేస్తే సుమారు 4,818 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని, ఆ పనులు కూడా పూర్తి చేయించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని సునీల్ ముఖ్యమంత్రి కోరారు.

అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుని కలిసి



వాకాడు, కోట, చిట్టమూరు మండలాలలో ఏఎంసి నిధులతో సుమారు 1కోటి 78 లక్షల రూపాయలతో రైతుల పొలాలకు వేయాల్సిన లింక్ రోడ్లు, గ్రావెల్ రోడ్లను మంజూరు చేయాలని, అలాగే వాకాడు ఏఎంసీ మార్కెట్ యార్డ్‌లోని భవనంలో 17 లక్షల రూపాయలతో మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సునీల్ కోరారు.

## రెడ్ల ఆత్మీయ సమావేశం



గూడూరులోని సిఆర్‌రెడ్డి కళ్యాణ మండపంలో సెప్టెంబర్ 28వ తేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెడ్ల ఆత్మీయ సమావేశం జరిగింది. అధ్యక్షులు శ్రీకిరెడ్డి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంఘం ద్వారా పేద రెడ్లకే కాకుండా, ఇతరులకు కూడా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. గున్నం సేవా ట్రస్ట్ అధినేత గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి 25 మంది పేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, సంఘం కోసం విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా వంజవాక సతీష్‌రెడ్డి, కొర్నిపాటి శ్యాంప్రసాద్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సుమతిరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, ధనంజయరెడ్డి, రాఘవరెడ్డి ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మీరారెడ్డి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులపై దాడులు ఆపాలి




ఇటీవల అనంతపురం, గుంటూరు నగరాల్లో మున్సిపల్ కార్మికులపై జరిగిన దాడులను నిరసిస్తూ.. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29వతేదీ గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపై చిన్నచూపు చూడడం మానుకోవాలని, అధికారులు కార్మికులతో కలిసిమెలిసి పని చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.రమేష్, బి.మురళి, శివకుమార్, బి.వి.రమణయ్య, ఎన్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావుకి సన్మానం

35 సంవత్సరాలు ఫిజికల్ డైరెక్టర్‌గా సాంకేతిక విద్యా రంగంలో విశేష సేవలు అందించిన కర్లపాళెం వెంకటేశ్వరరావు పదవీ విరమణను పురస్కరించుకొని సెప్టెంబర్ 27వ తేదీ నెల్లూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పదవీ విరమణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గూడూరు సాంకేతిక విద్యాశాఖలో సుమారు 25 సంవత్సరాలు ఫిజికల్ డైరెక్టర్‌గా ఆయన అపార సేవలు అందించారని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ఏసుదాసు అన్నారు. సభకు ఆయన అధ్యక్షత వహించగా, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎ.నిర్మల్‌కుమార్ ప్రియ విశిష్టఅతిథిగా పాల్గొన్నారు. పాలిటెక్నిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ కర్లపాళెం వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కళాశాల విద్యార్థినులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## 'ప్రగతి' పలసరుకుల పంపిణీ



నిరుపేదలు దసరా పండుగను ఆనందంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో సెప్టెంబర్ 28వ తేదీ గూడూరు, బాలాజీనగర్‌లోని ప్రగతి కార్యాలయంలో 15 పేద కుటుంబాలకు 18 రకాల పలసరుకులు పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!




పౌల్ట్రీ మరియు ఆక్వా రంగ ఉత్పత్తుల విభాగంలో నిష్ణాతుడిగా పేరు గడించి, హైటెక్ రమణారెడ్డిగా ప్రసిద్ధి చెందిన నలుబోలు వెంకటరమణారెడ్డి - శ్రీమతి శైలజల కుమారుడు **సందీప్ రెడ్డి - భానుజ రెడ్డి** (గుంటూరు వాస్తవ్యులు రెడ్డిబత్తుల మోహన్‌రెడ్డి - సుజాతల కుమార్తె)ల వివాహం సెప్టెంబర్ 26వ తేదీ గుంటూరులోను, పెళ్లి రిసెప్షన్ సెప్టెంబర్ 28వ తేదీ నెల్లూరులోనూ వైభవంగా జరిగాయి. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

# దళిత, గిరిజనవాడల్లో.. 5 వేల ఆలయాలు

## • రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం వెల్లడి



రాష్ట్రంలో దళిత, గిరిజనవాడలలో రానున్న అయిదేళ్ళలో 5వేల ఆలయాల నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఆ గుడుల నిర్మాణాలకు భక్తుల నుంచి నిధులు సమకూర్చడం జరుగుతుందన్నారు. గతంలో దేవాదాయ శాఖ మనుగడ కోల్పోయిందని, అనేక దేవాలయాల్లో ఎన్నోరకాల అవాంఛనీయ సంఘటనలు జరిగాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉదాహరణకు నెల్లూరుజిల్లాలోని కొండ బిట్రగుంట వద్ద రథం దగ్ధం చేయడం, అంతర్వేదిలో రథం తగలబడటం, అదేవిధంగా నాయుడుపేటలోని ఆంజనేయస్వామి విగ్రహాన్ని విరగ్గొట్టడం, విజయవాడ అమ్మవారి దేవస్థానంలో వెండి సింహాలు మాయం అవ్వడం వంటి దుర్ఘటనలు జరిగాయన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, హిందూ ధర్మం, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు.

### ధూపదీప నైవేద్యాలకు పుష్కలంగా నిధులు :

రాష్ట్రంలో సుమారు 5523 దేవాలయాల్లో ధూప దీప నైవేద్యాలకై నెలకు 10వేల రూపాయల వంతున నిధులు కేటాయించామని, త్వరలో ఆ పథకాన్ని మరో వెయ్యి దేవాలయాలకు వర్తింపజేయడం జరుగుతుందని, అర్చకులకు జీతం కూడా పెంచామని మంత్రి ఆనం ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా, వేదాధ్యయనం చేసే వేద విద్యార్థులకు నెలకు సంభావన కింద నెలకు 3వేల రూపాయలు వంతున దాదాపు 600 మందికి మూడు సంవత్సరాలు పాటు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 210 దేవాలయాల్లో సుమారు 232.75 కోట్ల రూపాయల సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధులతో ఆలయాల అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతోందన్నారు.

### శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో :

నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం, సుమారు 16.7 కోట్ల రూపాయలతో దేవస్థానంలో జరుగుతున్న ఆలయ పునర్‌నిర్మాణ పనులను పరిశీలించారు. అక్టోబర్ 29తేదీ బుధవారం ఉదయం పూజ్యశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి వారి చేతులమీదుగా దేవాలయ పునర్‌నిర్మాణ కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. తొలుత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో మంత్రి ఆనం పూజలు చేశారు.

# రోడ్ల బాగును పట్టించుకోని అధికారులు

## • స్థాయిసంఘ సమావేశాల్లో జడ్పీటీసీల ధ్వజం



రోడ్ల బాగుపై అధికారులు దృష్టి పెట్టడం లేదని, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు కూడా ఇవ్వడం లేదంటూ పలువురు జడ్పీటీసీలు ధ్వజమెత్తారు. ఇటీవల నెల్లూరులో జడ్పీ ఛైర్మెన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీలో 7 శాఖలకి సంబంధించి స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. చేసిన పనులకు, చేసే పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడం లేదని, దీంతో ఆ పనులు నత్తనడకన నడుస్తున్నాయని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఎన్నో పథకాలకు సంబంధించి పూర్తయిన పనులకు కూడా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రమంతా రోడ్లపై గుంతలు పూడ్చేశారని అంటున్నారే కానీ, నెల్లూరుజిల్లాలోని అనేక గ్రామాల్లో రోడ్ల దుస్థితి దారుణంగానే ఉందని వారు విమర్శించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా రోడ్ల బాగుకు పిడికెడు మట్టి వేసిన దాఖలాలు లేవన్నారు. రోడ్లెంత ఘోరంగా ఉన్నాయో..మర్రిపాడు మండలం కృష్ణాపురం, కంపసముద్రం రోడ్లను ఉదాహరణగా చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణాలను కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, నిర్మాణాల విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ అధికారులను ప్రశ్నించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల్లో కూడా ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదని ఆమె నిలదీశారు. పలు శాఖల్లో జరిగిన, జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించే ముఖ్యమైన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు రాకపోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారాలని అంటూ, సమావేశాలకు హాజరుకాని జిల్లా స్థాయి అధికారులపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేయాలని ఆమె జడ్పీ సీఇఓని ఆదేశించారు. అనంతరం జడ్పీటీసీలు మాట్లాడుతూ, ఐసీడీఎస్ ప్రాజెక్టుకి సంబంధించి తమకు కనీస సమాచారం ఉండడం లేదని, కేంద్రప్రభుత్వం ఆ ప్రాజెక్టు కింద ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా, ఒక్క విషయాన్ని కూడా అధికారులు తమకు తెలియపరచడం లేదన్నారు. మంచినీటి సరఫరాకి ఇబ్బందులు లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోని మోటార్లు, బోర్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. అవసరమైతే అందుకు జడ్పీ నిధులు కేటాయిస్తామని ఛైర్‌పర్సన్ అరుణమ్మ అధికారులకు చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలల్లోని వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి, వారికి మెరుగైన సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ సీఇఓ మోహన్ రావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ 'డిజిటల్ బుక్' ఆవిష్కరణ



కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో సెప్టెంబరు 28న 'డిజిటల్ బుక్' ఆవిష్కృతమైంది. నెల్లూరుసిటీ వైసీపీ నాయకుడు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి డిజిటల్ బుక్ క్యూఆర్ పోస్టర్‌ను నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని ఇబ్బందిపెట్టిన వారిపై ఫిర్యాదు చేసేందుకు.. డిజిటల్ బుక్ ఒక అస్త్రమని పర్వతరెడ్డి చెప్పారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. కార్యకర్తలు ఫిర్యాదు చేసిన వారిపై తప్పకుండా శిక్ష పడేలా చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ నాయకుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితో పాటు నాయకులు మేరుగ మురళి, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగుల నిరసన



తమకు ఇంటింటి సర్వేలు, వలంటరీ విధులు అప్పగించవద్దంటూ సచివాలయ ఉద్యోగులు సెప్టెంబరు 29న నెల్లూరులో 'చలో కలెక్టరేట్' కార్యక్రమం చేపట్టారు. సచివాలయ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జరిగిన ఈ నిరసనలో తొలుత, స్థానిక విఆర్‌సి కూడలి వద్ద నుంచి సచివాలయ ఉద్యోగులు పెద్దసంఖ్యలో ర్యాలీగా వచ్చి, డా. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి, అక్కడ నుంచి కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. తమను మాతృశాఖలో విలీనం చేయాలని, ఆర్థికపరమైన అంశాల్లో తమకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. నాయకులు పాండురంగ, చైతన్య, షాహినా తదితరులు పాల్గొన్నారు.

# 'హిమని'కి డాక్టరేట్



తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని, నెల్లూరుకు చెందిన రాజారామ్ హిమనికి ఆ విశ్వవిద్యాలయం ఇటీవల డాక్టరేట్‌ని ప్రదానం చేసింది. 'స్టార్టప్ ఇండియా పాలసీ అండ్ ఉమెన్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్' అనే అంశంపై, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ కాత్యాయిని మార్గదర్శకత్వంలో ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆ పరిశోధక గ్రంథానికి ఆచార్యుల ప్రశంసలు లభించాయి. హిమనికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా పలువురు అధ్యాపకులు, విద్యార్థులు ఆమెని అభినందించారు.

# పక్కదారి పట్టిన హౌసింగ్ నిధులు

## -- బీజేపీ నేత మిడతల రమేష్ --

రాష్ట్రంలో గృహనిర్మాణాలకు కేటాయించిన నిధులు భారీస్థాయిలో దుర్వినియోగం అయ్యాయని, పూర్తయిన 8 లక్షల ఇళ్ళలో ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో లబ్దిదారులు ఆ ఇళ్ళలో చేరేందుకు ఇష్టపడడం లేదని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ చెప్పారు. మంగళవారం ఆయన నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి ఆమేరకు వినతి పత్రం సమర్పించారు. లేఅవుట్ల లెవలింగ్ కోసం తట్టెడు మట్టి కూడా వెయ్యకుండానే నిధులను దారిమళ్ళించి అధికారులు, కాంట్రాక్టర్లు అందినకాడకి స్వాహాచేశారని ఆయన ఆరోపించారు.

# కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి



కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కౌలురైతుల సంఘం కార్యదర్శి జమలయ్య ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబరు 28న ఆయన జిల్లా నాయకులతో కలిసి నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో పంటపొలాల్లో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతుధరకు రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించాలని ఆయన కోరారు. ఈ ఎడగారు సీజన్‌లో పండిన ధాన్యం దళారుల పాలు కాకుండా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

# పెంపుడు జంతువులకు టీకా వేయించాలి



పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి రాకుండా వాటి యజమానులు క్రమం తప్పకుండా టీకా వేయించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.సోమయ్య చెప్పారు. ప్రపంచ రేబిస్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన సెప్టెంబరు 28న నెల్లూరులోని రైల్వేఫీడర్స్‌రోడ్డులో ఉన్న వెటర్నరీ పాలీ క్లినిక్‌లో పెంపుడుకుక్కలకు ఉచితంగా టీకాలు వేయడాన్ని పర్యవేక్షించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డా.జె.చైతన్యకిషోర్, డాక్టర్ ఎం.మాల కొండయ్య, డా.జి.కృష్ణమూర్తి, సిహెచ్ రామచంద్రరావు, పశు సంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'సులక్షిత'కి విశిష్ట సత్కారం



నెల్లూరులోని ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి ఎం. సులక్షిత ప్రియ ధరణికి విశిష్ట సత్కారం లభించింది. శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం వార్షికోత్సవం సందర్భంగా సెప్టెంబరు 29న నగరంలోని టౌన్‌హాలులో ప్రదర్శించిన శివాష్టకంలోని 'ప్రభుం కాలనాథం.. విభుం విష్ణునాథం' స్తోత్రానికి చేసిన అద్భుత నాట్యాభినయం అందరినీ అలరించింది. ఈ సందర్భంగా ప్రసిద్ధ నృత్యకళాకారుడు..నాట్యగురువు దేగల సాంబశివరావు ఆ బాలికను ఘనంగా సన్మానించారు. నాట్యంలో మరింత సాధనచేసి ఉన్నత శిఖరాలందుకోవాలని సులక్షితని దీవించారు.

# మహాకవి కాళిదాసు రచనలు అద్భుతం



మహాకవి కాళిదాసు నాటక రచనలు అద్భుతమని చెన్నై వివేకానంద కళాశాల సంస్కృత పండితులు, విశ్రాంత ఆచార్యులు డా.కల్లే ప్రశాంత్ కొనియాడారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా, 165వ ప్రసంగం టీనగర్‌లోని ఆంధ్రా క్లబ్-కృష్ణాహాలులో సెప్టెంబరు 28న ఈ కార్యక్రమం జరిగింది. డా. ప్రశాంత్ పాల్గొని 'మహాకవి కాళిదాసు-అభిజ్ఞాన శాకుంతలం' అనే అంశంపై ప్రసంగించారు. నాటక రమణీయతకు శాకుంతలం నిదర్శనమన్నారు. వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు, డా.ప్రశాంత్‌ని సన్మానించారు.

# ఏమ్మా!.. జీఎస్టీ తగ్గిందా.. ధరలు తగ్గాయా?

## ○ ఆరా తీసిన..20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్



'ఏమ్మా జీఎస్టీ తగ్గింది కదా..తగ్గిన ధరకే వస్తువులు ఇస్తున్నారా? ఏం సార్..బైక్‌ల ధరలు బాగా తగ్గాయి కదా, మార్కెట్లో వ్యాపారస్తులు ధరలు తగ్గించారా?..ఇన్సూరెన్సులపై పూర్తిగా జీఎస్టీ లేదు..ఆ విషయం మీకు తెలుసా'..అంటూ 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ వినియోగదారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబరు 28న నెల్లూరుకు వచ్చిన ఆయన, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.

నెల్లూరు నగరంలోని డీమార్ట్, హీరోహొండా, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలను ఈ సందర్భంగా లంకా దినకర్ పరిశీలనలు చేశారు. జీఎస్టీ అమలుచేస్తున్నారా, లేదా అని స్వయంగా పరిశీలించారు. డిమార్ట్‌లో పలు వస్తువుల ధరలను పరిశీలించి వినియోగదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జీఎస్టీ 2.0 అమలుకు ముందు, సెప్టెంబరు 22 నుంచి జీఎస్టీ 2.0 అమలు చేసిన తర్వాత తగ్గిన ధరల తేడాను వినియోగదారులకు వివరించారు. హీరోహొండా షోరూంలో జీఎస్టీ 2.0 వలన తగ్గిన బైక్ ధరల వివరాలను ప్రచురించిన బోర్డును పరిశీలించారు. స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ కార్యాలయాన్ని సందర్శించి, ఇన్సూరెన్స్‌పై పూర్తిగా జీఎస్టీ తొలగించిన విషయంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్రజలందరికీ జీఎస్టీ ఫలాలను అందించాలని వ్యాపారులకి సూచించారు. ఇన్సూరెన్స్ అందరికి అందుబాటులో ఉందని వివరించారు. జీఎస్టీ అమలులో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిఎస్‌టి జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం.సత్యప్రకాష్, కందుకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సోమశిల డ్యామ్‌కి..వరద జలాలు



ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున సోమశిల జలాశయానికి వరద జలాలు పెరుగుతున్నాయి. పైతట్టు ప్రాంతంలోని ఆదినిమ్మాయపల్లి రెగ్యులేటర్ వద్ద నుంచి సెప్టెంబరు28న 24,838 క్యూసెక్కుల వరదనీటి ప్రవాహం వచ్చినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. సోమశిల జలాశయం 72.87 టీఎంసీల నీటితో పుష్కలంగా ఉన్నందువల్ల, ఆ వరద జలాలను అధికారులు దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. దీంతో పెన్నానదీ పరీవాహక ప్రజలు వరద నీటిలో చిక్కుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. సోమశిల జలాశయం నుంచి పెన్నానదికి 2650 క్యూసెక్కుల నీటిని వదిలారు. కండలేరుకు 6వేలు, ఉత్తర కాలువకు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# చెడుపై విజయమే..'విజయదశమి'



దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసమే జగన్మాత ఆవిర్భావం జరిగిందని, చెడుపై విజయం సాధించి మంచిని నిలబెట్టేందుకు మహాశక్తి స్వరూపిణి అయిన అమ్మవారు యుద్ధంలో మహిషాసురుని సంహరించిందని, దుష్టత్వంపై సాధించిన ఆ విజయాన్ని స్మరించుకుంటూ చేసుకునే పండుగే విజయదశమి అని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ చెప్పారు. కావలిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొని, సెప్టెంబరు 28న దేవీభాగవతంలోని 'మహిషాసుర మర్దనం' ఘటనను తన ప్రవచనం ద్వారా భక్తులకు వివరించారు. అనంతరం, ఆలయ పాలక వర్గం ప్రతినిధులు కందుకూరి వెంకట సత్యనారాయణ, బి.వీరాస్వామి, బాలాజీ ఎంటర్ ప్రైజెస్ అధినేత చన్నా వెంకటరామయ్య తదితరులు అవధాని రాజశేఖర్‌ని ఘనంగా సన్మానించారు.

## టూకీగా...



### రుద్రకోట వద్ద అక్రమ మట్టి ట్రాక్టర్ల పట్టివేత

కావలి రూరల్ మండలంలోని రుద్రకోట చెరువు వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సెప్టెంబరు 28న కావలి నీటిపారుదల శాఖ ఏఇ హరీష్‌కుమార్ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కావలి రూరల్ ఎస్ఐ బాజీబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కట్టకిందపల్లి రామాలయంలో చోరీ

దుత్తలూరు మండలం కట్టకిందపల్లి గ్రామంలో ఉన్న రామాలయంలో ఇటీవల దొంగలు పడి అమ్మవారికి చెందిన తాళిబొట్లను అపహరించుకుపోయారు. హుండీని పగలగొట్టి అందులో ఉన్న డబ్బును కాజేశారు. మొత్తంగా 2 లక్షల సొమ్ము దొంగలపాలైనట్లు గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

### కొడెలమిట్ట వద్ద ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సెప్టెంబరు 28న వెంకటాచలం పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి వేళ గుడ్లూరువారిపాళెం గ్రామానికి ఇసుక తరలించుకుపోతున్న ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.

### కోవూరులో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సుధాకర్‌రెడ్డి సెప్టెంబరు 28న మరోసారి గట్టిగా కౌన్సిలింగ్ ఇచ్చారు. కేడీలు, రౌడీషీటర్లుగానే ఉండక ఇకనైనా మంచి నడవడికతో జీవించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు, నేరాలకు పాల్పడకుండా బుద్ధిగా బతకాలని క్లాస్‌పీకారు. ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### సోమశిలలో పర్యాటకుల సందడి

జిల్లాలోని సోమశిల జలాశయాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య గత కొద్దిరోజులుగా బాగా పెరిగింది. దసరా సెలవులు కావడం, సోమశిల డ్యామ్‌లో పుష్కలంగా నీరుండడం, చుట్టుపక్కల వాతావరణమంతా ప్రకృతి సోయగాలతో ఆహ్లాదంగా ఉండడంతో సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

### బిజ్జంపల్లిలో పూర్వ విద్యార్థుల సమావేశం

ఉదయగిరి మండలం బిజ్జంపల్లి జడ్పీ హైస్కూల్‌లో 2003-04వ సంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థులు ఇటీవల ఆత్మీయంగా కలిశారు. పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్, ఐరన్ ర్యాక్ వగైరా వసతులు కల్పించారు. ఎంఇఓ టి.వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు జె.మాధవరావు, పూర్వవిద్యార్థులు బండి ప్రసాద్, కాకు రమాదేవి, పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాపూరులో జాషువా జయంతి వేడుక

రాపూరు ప్రభుత్వ గ్రంథాలయంలో సెప్టెంబరు 28న నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతి ఘనంగా జరిగింది. లైబ్రేరియన్ అలిశెట్టి అంజయ్య ఈ సందర్భంగా జాషువా, భగత్‌సింగ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ మహనీయుల సేవలను పాఠకులకు వివరించారు. గ్రంథాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### విడవలూరులో అంకమ్మతల్లికి అభిషేక పూజలు

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా విడవలూరు గ్రామ దేవత అంకమ్మతల్లికి గ్రామస్తులు ఇటీవల పెద్దఎత్తున పూజలు, అభిషేకాలు చేశారు. సెప్టెంబరు 28న సరస్వతిదేవి అలంకరణతో అంకమ్మ అమ్మవారికి వేడుకగా అలంకరణలు చేశారు. పొంగళ్లు నైవేద్యంగా పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. గునపాటి వరదారెడ్డి-కల్పన ఉభయకర్తలుగా వ్యవహరించారు.

### కావలిలో భగత్‌సింగ్ జయంతి

విప్లవవీరుడు భగత్‌సింగ్ జయంతిని కావలిలోని సామాజిక కార్యకర్త ఇళ్ళ రమణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి, దేశానికి స్ఫూర్తిదాయకమైన సేవలందించిన ఆయన దేశభక్తిని తెలియజేశారు. స్థానిక యువత, ప్రముఖులు పాల్గొన్నారు.

# జిల్లా కొత్త సారధులకు.. విపిఆర్ వెల్‌కమ్





నెల్లూరు జిల్లాలో కొత్తగా నియమితులైన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ అజితలను నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) సెప్టెంబర్ 30వ తేదీ మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకి కొత్తగా వచ్చిన ఇద్దరు ప్రధాన అధికారులకు ఆయన స్వాగతం పలికారు. జిల్లాలోని పలు అభివృద్ధి అంశాలపై జిల్లా కలెక్టర్‌తోను, అలాగే జిల్లాలో శాంతిభద్రతలు, నగర ట్రాఫిక్ వ్యవస్థ తదితర అంశాలపై జిల్లా ఎస్పీతోనూ విపిఆర్ చర్చించారు.

# జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకెంతో మేలు

## - నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి




కేంద్రప్రభుత్వం ఇటీవల చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు, వ్యాపారస్తులకు కూడా ఎంతో మేలు చేసేవిధంగా ఉన్నాయని, ప్రజలు జీఎస్టీపై అవగాహన పెంపొందించుకుని వాటిని ఉపయోగించుకోవాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) చెప్పారు. జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ సోమసుందర ప్రసాద్ తదితరులు మంగళవారం నెల్లూరులోని విపిఆర్ నివాసంలో కలిసి, అక్టోబర్ 8వ తేదీన జీఎస్‌టీపై నిర్వహించే అవగాహన సదస్సుకు ఆయన్ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీఎస్‌టీ2.0పై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కరపత్రాన్ని ఎంపీ విపిఆర్ ఆవిష్కరించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల నిత్యావసరాల ధరలు తగ్గడంతో పాటు, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మానవతావాది.. లక్ష్మణ్‌సింగ్‌కి రాష్ట్ర పదవి



నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ మానవతావాది, మానవ హక్కుల నాయకుడు లక్ష్మణ్‌సింగ్‌కి రాష్ట్ర స్థాయిలో సముచిత పదవి లభించింది. ఆలిండియా హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్(ఏఐహెచ్‌ఆర్‌ఏ) ఆంధ్రప్రదేశ్ కో–ఆర్డినేటర్‌గా ఆయన నియమితులయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఆయన మానవ హక్కుల పరిరక్షణకు రాష్ట్రస్థాయిలోనే కాక, జాతీయ స్థాయిలో కూడా కృషి చేస్తున్నారు. మానవ హక్కుల సంరక్షణకు తనవంతు పాటుపడతానని ఆయన చెప్పారు. తనకు రాష్ట్ర కోఆర్డినేటర్ బాధ్యతలనిచ్చిన ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంయు దువా, కార్యదర్శి ఖలీద్‌ఫా తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




# మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి

# 15లక్షలు విరాళంగా ఇచ్చిన మన నెల్లూరీయుడు

మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి మన నెల్లూరుకి చెందిన పోతుగుంట శ్రీధర్‌నాయుడు 15 లక్షలు విరాళంగా అందచేశారు. తమ సంస్థ పీ.వెంకట రమణయ్య ఇంజనీర్స్ & కాంట్రాక్టర్స్ (పీవీఆర్ఇ సిపిఎల్) తరపున మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కి సెప్టెంబర్ 30వతేదీ మంగళవారం నాడు ఈ చెక్కుని అందజేశారు. మహారాష్ట్రలో ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకోవడం కోసం ఈ విరాళాన్ని అందించినట్లు శ్రీధర్‌నాయుడు తెలిపారు.

# శ్రీసిటీలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత





శ్రీదేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని అంతర్జాతీయ పారిశ్రామికవాడ శ్రీసిటీలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. దేశ విదేశాలకు చెందిన ఎన్నో పరిశ్రమలు కొలువైవున్న శ్రీసిటీలో నవరాత్రి వేడుకల సందర్భంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా, ఐక్యతను ప్రతిబింబించేలా వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మంగళవారం నాడు ఆయుధపూజను నిర్వహించారు. శ్రీసిటీలోని పలు పరిశ్రమల వారు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆయా కంపెనీల వారు తమ ఉత్పత్తులకు వినియోగించే పనిముట్లు, యంత్రాలు, వాహనాలను పూలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పరిశ్రమల ద్వారాల వద్ద రమణీయంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. బుధవారం కూడా పలు పరిశ్రమల వారు ఆయుధపూజ చేశారు. కార్మికుల భద్రత, శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ పూజలు చేయడం విశేషం.

## • జిల్లాలో చెలరేగిపోతున్న హిజ్రాలు

# దండకాల పేరుతో దాడులు!



***ఒకప్పుడు హిజ్రాలంటే సమాజంలో గౌరవం ఉండేది. వారి పట్ల జాలి కలిగేది. జీవనం కోసం వారు దుకాణాల వద్ద అభ్యర్థిస్తుంటే అయ్యో పాపం అనిపించేది. అప్పట్లో వారు కూడా ఎంతో సౌమ్యంగా, మంచిగా ఉండేవారు. వారు కనిపిస్తే జనమే త్రుణమో పణమో ఇచ్చి పంపేవారు. హిజ్రాలకి డబ్బులిస్తే పుణ్యమని కూడా భావించేవారు. పాత రోజుల్లో హిజ్రాలు ఆశీర్వదిస్తే మంచిదన్నది చాలామంది అభిప్రాయం. వారు దీవిస్తేనో, దిష్టి తీస్తేనో ఎలాంటి చిక్కులు చీకాకులున్నా తొలగిపోతాయన్నది వారి నమ్మకం.***

కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. ఇటీవలి కాలంలో వారి ప్రవర్తనలలో మార్పు వచ్చింది. వారిని చూస్తేనే జనం జడుసుకుని ఆమడ దూరం పారిపోయేలా హిజ్రాలు ప్రవర్తిస్తున్నారు. దండకాల పేరుతో దాడులకి తెగబడుతుండడంతో హిజ్రాల పట్ల జనానికి ఉన్న అభిప్రాయం, ఆదరభావం పూర్తిగా తగ్గిపోయింది. తరచూ బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుండడంతో, అలాంటివారి పట్ల ఏహ్యభావం కలుగుతోంది.

ఇటీవల కాలంలో కొంతమంది హిజ్రాలు కార్యాలయాలు, షో రూములు, హోటళ్లు, దాబాలు, దుకాణాలు వంటి వ్యాపార సముదాయాలకి వెళ్ళి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. వాళ్ళు కోరినంత ఇవ్వకుంటే దాడులకి తెగబడుతున్నారు.

### నిత్యం అనేక సంఘటనలు

జిల్లాలో అనేక ప్రాంతాలతో పాటు నెల్లూరు నగరంలో కూడా ఈ దందా గత కొంతకాలంగా విచ్చలవిడిగా సాగుతోంది. అడిగేవారు, అడ్డుకునే వారు లేకపోవడంతో ఏకంగా సంస్థల సిబ్బంది పైనా, దుకాణాల నిర్వాహకులపైనా హిజ్రాలు దాడులకు సైతం తెగబడుతున్న సంఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. కొంతమంది మగవాళ్ళు సైతం హిజ్రాలలా వేషాలు వేసుకుని జనం వద్ద దండకాల కోసం దండయాత్ర చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మైనింగ్ మాఫియాకి వ్యతిరేకంగా ఆమరణ దీక్ష చేస్తుండిన మాజీ మంత్రి, ప్రస్తుత సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పైకి ఆనాటి జిల్లా మంత్రి ఒకరు బస్సు నిండా హిజ్రాలని ఎక్కించి పంపడం అప్పట్లో పెను సంచలనంగా మారింది కూడా. రాజకీయ నాయకులు కూడా తమ అరాచకాలు సాగించుకోవడానికి హిజ్రాలని అడ్డం పెట్టుకోవడం గమనిస్తే హిజ్రాల దుర్మార్గపు చర్యలు ఏ స్థాయిలో వుంటున్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

### కఠిన చర్యలు తీసుకోవాలి

ఇటీవల నెల్లూరు నగరంలోని ఓ డాబా వద్దకు కొందరు హిజ్రాలు వెళ్ళి దసరా మామూళ్ళు అడిగారని, యజమాని లేరని అక్కడున్న వారు చెప్పడంతో హిజ్రాలు వారిపై దాడిచేశారనే సంఘటన పత్రికలలో వచ్చింది. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. అదేవిధంగా కందుకూరులో కూడా ఓ ప్రైవేటు వైద్యశాలకు మామూళ్ళ కోసం వెళ్ళిన హిజ్రాలు అక్కడ సిబ్బందిపై దాడికి దిగారు. డాక్టరు లేరని చెప్తున్నా వినకుండా అక్కడి డ్యూటీ నర్సుని విచక్షణా రహితంగా కొట్టారు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సమాజంలో అణకువగా ఉండాల్సిన హిజ్రాలు, ఇలా దౌర్జన్యకాండలకు దిగుతుండడంతో వ్యాపారులు సైతం హడలిపోతున్నారు.

హిజ్రాల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వ్యాపారవేత్తలు, ప్రజలు కోరుతున్నారు. దౌర్జన్యకాండకి దిగితే శిక్ష తప్పదనేలా వారికి భయం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. ఆయా ప్రాంతాలలో వున్న హిజ్రాలందరినీ పోలీసు శాఖవారు ఓ చోటకి చేర్చి రౌడీషీటర్లకి ఇచ్చినట్లుగా కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచిస్తున్నారు. పోలీసులూ పారా హుషార్...!

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com